జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాపాలన

Published from Hyderabad, Vishakhapatnam, Vijayawada*

NEWS IS RIGHT

https://prajapalana.com/epaper.php

చదవండి... చదివించండి... చందాదారులుగా చేరండి...
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాపాలన
6-2-29/3/12, 3వ అంతస్థు,
దౌలత్ ప్లాజా, లక్డీకాపూల్, హైదరాబాద్ - 004
వివరాలకు సంప్రదించండి : 8886022523

సంపుటి 15 సంచిక 106 విశాఖపట్నం | శుక్రవారం 31 డిసెంబరు 2021 | 8 పేజీలు | వెల : 5.00

## ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కీలక ఉత్తర్వులు




విజయవాడ: టీనేజర్లకి కోవిడ్ వ్యాక్సినేషన్ ప్రక్రియపై ఏపీ వైద్య ఆరోగ్య శాఖ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. బూస్టర్ డోసు,15-18 ఏళ్ల వయసు గల వారికి వాక్సినేషన్ ప్రక్రియపై గైడ్ లైన్స్ విడుదల చేసింది. 15-18 ఏళ్లు దాటిన వారికి జనవరి ఒకటి నుంచి వాక్సినేషన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. 15 ఏళ్ల నుంచి 18 ఏళ్ల వరకు వయసు గల వారికి 2022 జనవరి 3 నుంచి వాక్సినేషన్‌కు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జనవరి 10వ తేదీ నుంచి రెండో డోసు వేసుకొని 9 నెలలు పూర్తయిన హెల్త్ వర్కర్స్, ఫ్రంట్ లైన్ వారియర్స్‌కు బూస్టర్ డోసు ఇవ్వనున్నారు. 60 ఏళ్లు పైబడిన వారు, హెల్త్ వర్కర్స్, రెండు డోసులు పూర్తయిన వారికి డాక్టర్ల సూచనల మేరకు జనవరి 10వ తేదీ నుంచి బూస్టర్ డోసు ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు, జాయింట్ కలెక్టర్లకు,వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# 8 రాష్ట్రాలకు కేంద్రం లేఖ

### కరోనా కేసులు భారీగా పెరుగుతున్నాయి.. చర్యలు తీసుకోండి



ఢిల్లీ: దేశంలో కరోనా విజృంభిస్తోంది. రోజురోజుకూ కేసుల సంఖ్య పెరుగుతోంది. ఈ క్రమంలోనే కరోనా ప్రమాదకర వేరియంట్ ఓమిక్రాన్ కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అంతటా ఆందోళన నెలకొంది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం గురువారం ఢిల్లీ, హర్యానా, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, జార?ండ్‌లకు లేఖలు రాసింది. కోవిడ్-19 కేసులను అరికట్టేందుకు వ్యాక్సినేషన్‌ను పెంచాలని రాష్ట్రాలకు సూచించింది. దీంతోపాటు కరోరనా పరీక్షలు, ఆసుపత్రుల్లో సౌకర్యాలను పెంచడం, ట్రేసింగ్, కంటైన్మెంట్ జోన్లపై దృష్టి సారించాలని లేఖలో తెలిపింది. కాగా.. గడిచిన 24 గంటల్లో దేశంలో 13,154 కొత్త కరోనా కేసులు నమోదైన తరుణంలో కేంద్రం ఈ హెచ్చరిక చేసింది. కాగా.. గురువారం దేశంలో మొత్తం ఓమిక్రాన్ సంఖ్య 961కి పెరిగింది. దేశంలో వారం వారీగా పాజిటివిటీ రేటు 0.76 శాతం నమోదైంది. ఇది గత 46 రోజులలో 1 శాతం కంటే తక్కువగా ఉంది.

(మిగతా 7లో..)

## 36 మంది డీఎస్పీలకు అదనపు ఎస్పీలుగా పదోన్నతి




అమరావతి: రాష్ట్రంలో 36 మంది డీఎస్పీ (సివిల్)లకు అదనపు ఎస్పీలు (సివిల్)గా ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. వీరిలో ఐదుగురు 2020 నుంచి అడ్‌హాక్ పద్ధతిలో అదనపు ఎస్పీలుగా విధులు నిర్వర్తిస్తున్నారు. అదనపు ఎస్పీలుగా పదోన్నతి పొందిన 36 మందిని మంగళగిరిలోని రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశిస్తూ రాష్ట్ర హోం శాఖ బుధవారం ఉత్తర్వులిచ్చింది.

### యూకే నుంచి కోల్‌కతా వచ్చే విమానాలపై పశ్చిమ బెంగాల్ నిషేధం

కోల్‌కతా: ప్రాణాంతక కరోనా వైరస్‌లోని నయా వేరియంట్ ఒమైక్రాన్ దేశంలో శరవేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం అప్రమత్తమైంది. వేరియంట్ వ్యాప్తికి అడ్డుకట్టే వేసే చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా ఒమిక్రాన్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న యూకే నుంచి వచ్చే విమానాలను నిషేధిస్తున్నట్టు ప్రకటించింది.యూకే నుంచి కోల్‌కతాకు వచ్చే అన్ని విమానాలను నిషేధిస్తున్నట్టు పేర్కొన్న ప్రభుత్వం జనవరి 3 నుంచి ఇది అమల్లోకి వస్తుందని తెలిపింది. మళ్లీ ప్రకటించే వరకు ఈ నిషేధం కొనసాగుతుందని స్పష్టం చేసింది. 'నాన్ ఎట్ రిస్క్' దేశాల నుంచి వచ్చే వారు సొంత ఖర్చుతో కరోనా పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుందని ప్రబుత్వం పేర్కొంది.

# ముంబై అలర్ట్

### ఉగ్రదాడులు జరగొచ్చంటూ సమాచారం..



ముంబై: ఆంగ్ల సంవత్సరాది వేడుకల వేళ దేశ వాణిజ్య రాజధాని ముంబైలో ఉగ్రదాడులు జరిగే అవకాశం ఉందని సమాచారం అందడంతో అలర్ట్ ప్రకటించారు. ఖలీస్థానీ తీవ్రవాదులు దాడులకు పాల్పడవచ్చేనే నిఘావర్గాల సమాచారం అందడంతో ముంబై పోలీసులు అప్రమత్తమయ్యారు. ముంబై, బాంద్రా, దాదర్, చర్చ్‌గేట్, కుర్ల తదితర స్టేషన్ల వద్ద భద్రతను కట్టుదిట్టం చేశారు. పోలీసులకు సెలవులు రద్దు చేశారు. 3వేల మంది పోలీసులను ప్రధాన స్టేషన్ల వద్ద మోహరిస్తామని ముంబై రైల్వే పోలీస్ కమిషనర్ ఖలిద్ తెలిపారు.

# వాణిజ్య పరంగా వెనుకబడిన ఇస్రో




సూళ్లూరుపేట: ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న కరోనా కొత్త కొత్తగా రూపాంతరం చెందుతూ విరుచుకుపడుతోంది. మానవ జీవన గమనంతో పాటు దేశ సాంకేతిక అభివృద్ధికి అవరోధంగా మారింది. నాలుగు దశాబ్దాల చరిత్రలో రాకెట్ ప్రయోగాలకు సుదీర్ఘ అంతరాయం ఏర్పడింది. రెండు దశాబ్దాల కాలంలో రాకెట్ ప్రయోగం జరగని ఏడాది లేదు. రెండేళ్లకు ముందు వరకు ఏడాదికి ఏడెనిమిది ప్రయోగాలు చేస్తే.. రెండేళ్లలో నాలుగు ప్రయోగాలతో సరిపెట్టుకోవాల్సిన పరిస్థితి అనివార్యమైంది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)ను కరోనా కుదేలు చేసింది. రెండేళ్లుగా రాకెట్ ప్రయోగాలకు సుదీర్ఘ విరామం ఏర్పడింది. 2020 మార్చిలో విజృంభించిన కరోనా ప్రభావంతో ఆ ఏడాది రెండు ప్రయోగాలకు పరిమితమైంది. 2015 నుంచి 2019 వరకు ఏడాదికి 7, 8 తగ్గకుండా ప్రయోగాలు చేసింది. ఈ నేపథ్యంలో ప్రయోగాల సంఖ్య పెంచడానికి మూడో ప్రయోగ వేదిక అందుబాటులోకి తీసుకు వచ్చింది. చిన్న తరహా ఉపగ్రహాల ప్రయోగం కోసంగా ఎస్ఎస్ఎల్వీ రాకెట్‌ను అభివృద్ధి చేసింది. ఇందు కోసం తమిళనాడులోని

(మిగతా 7లో..)

# పీఆర్సీపై తేలని పంచాయితీ



అమరావతి : పీఆర్సీపై ఏపీ సచివాలయంలో ఉద్యోగ సంఘాలతో ప్రభుత్వం సమావేశమైంది. ఆర్థికశాఖ అధికారులు శశిభూషణ్ కుమార్, సత్యనారాయణల నేతృత్వంలో విడతల వారీగా ఉద్యోగ సంఘాలతో పీఆర్సీ సహా ఆర్థిక అంశాలపై చర్చించారు. తొలుత ఏపీ ఎన్జీఓ, ఏపీ రెవెన్యూ తదితర సంఘాలతో అధికారులు సమావేశమై ప్రభుత్వ ప్రతిపాదనలు వారి ముందు ఉంచారు. ప్రస్తుతం 27 శాతం ఐఆర్ ఇస్తున్నందున కొద్దిమేర పెంచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశాలు జారీచేశారని పేర్కొన్నారు. కొత్తగా రూపొందించిన ప్రతిపాదనలను ఉద్యోగ సంఘాలకు వివరించారు. సమావేశం ముగిసిన తర్వాత ఉద్యోగ సంఘాల నేతలు మీడియాతో మాట్లాడుతూ... అధికారుల తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. "వారం పది రోజుల్లో పీఆర్సీ ఇస్తామని సీఎం తిరుపతిలో చెప్పారు. ఇవ్వలేదు. ఆ తర్వాత 72గంటల్లో ప్రకటిస్తామన్నారు... అదీ లేదు. ఇవాళ సమావేశానికి పిలిచి పీఆర్సీ ఎంత ఇస్తారో చెప్పకుండా ఆర్థిక పరమైన అంశాలు వివరిస్తున్నారు. 14.29శాతం ఫిట్‌మెంట్ ఆమోదయోగ్యం కాదని చెప్పాం. చర్చల పేరుతో కాలయాపన చేస్తున్నారు తప్ప... ఫలితం ఉండటంలేదు" అని ఏపీ జేఏసీ ఛైర్మన్ బండి శ్రీనివాసులు పేర్కొన్నారు. జనవరి 3న జరిగే జేఏసీ సమావేశంలో తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు. ఉద్యోగులను అవమానించడానికి సమావేశాలు నిర్వహిస్తున్నారు తప్ప ఉపయోగం లేదని అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. "ఈరోజు చెబుతున్నారు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి గురించి. రాష్ట్రంలో వచ్చే ఆదాయంలో రూ.75వేల కోట్లు ఉద్యోగుల కోసమే ఖర్చు చేస్తున్నామంటున్నారు. 2013 నుంచి ఇప్పటి వరకు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఎక్కడా తగ్గలేదు.

(మిగతా 7లో..)

## మన్మోహన్‌కు లేని ఆ క్వాలిటీ మోదీకి ఉంది: శరద్ పవార్



ముంబై: మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్‌కు లేని ఒక విశిష్ట లక్షణం నరేంద్రమోదీకి ఉందని, అదే ఆయన బలమని ఎన్సీపీ అధినేత శరద్ పవార్ అన్నారు. మోదీ ఏదైనా అనుకుంటే ఆ పని పూర్తి చేసే వరకు నిద్రపోరని అంతే కాకుండా ఆయన పని చేసే విధానం కూడా భిన్నంగా ఉంటుందని ఇది మన్మోహన్‌లో లేదని ఆయన అభిప్రాయపడ్డారు. మహారాష్ట్రలోని పూణెలో లోక్‌సత్తా అనే మరాఠీ పత్రిక నిర్వహించిన ఓ కార్యక్రమంలో పవార్ పాల్గొని ప్రసంగించారు."ఆయన (మోదీ) ఏదైనా పని తన చేతుల్లోకి తీసుకుంటే పని ముగిసే వరకు చాలా అంకితభావంతో పని చేస్తారు. తను బయట ఉన్నప్పటికీ అడ్మినిస్ట్రేషన్‌ను బాగా అదుపు చేస్తారు. అయితే పని విధానంలో నాణ్యత, ఉద్దేశాలు బాగా ఉండాలి. మోదీ తన పనులు అనుకున్నవి అనుకున్నట్లు పూర్తి చేస్తారు. కానీ నాణ్యత, ఉద్దేశాల విషయంలో పెద్ద లోపం ఉంది. సాధారణ ప్రజల ఆంకాక్షలను అవి ప్రతిఫలించడం లేదు" అని పవార్ అన్నారు. తన కెబినెట్‌ని ప్రధానమంత్రి కార్యాలయాన్ని అదుపు చేయడంలో మోదీకి ఒక భిన్న శైలి ఉంటుందని, అది మన్మోహన్‌లో తాను చూడలేదని పవార్ అన్నారు. ఇక బీజేపీతో పొత్తుపై ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలు మహారాష్ట్రలో మరింత విస్తృతంగా అమలు చేయడానికి బీజేపీతో చేతులు కలపమని మోదీ తనను కోరినట్లు చెప్పుకొచ్చారు. అయితే మోదీ ప్రతిపాదనను తాను తిరస్కరించానని పవార్ అన్నారు.



# మానవ హక్కుల పోరాటం భీమ్ కోరేగావ్ యుద్ధం

## తన చరిత్ర తెలియని వాడు చరిత్ర శృష్టించలేడు: బాబాసాహెబ్ అంబేద్కర్

భారతదేశ చరిత్రను బ్రాహ్మణీకరణ చేసే క్రమంలో మనువాద చరిత్రకారులు, మన పూర్వీకుల చరిత్రను మరుగున పరచి, చరిత్ర పుస్తకాలను అబద్ధాలతో, వక్రీకరణలతో నింపివేసారు.. ఈనాడు ఈ నీచత్వంలో మరో ముందడుగు వేసి రామాయణ, మహా భారతం లాంటి అభూత కల్పనలతో చరిత్రను నింపే జుగుప్సాకారమైన ప్రయత్నం చేస్తున్నారు మనువాద మూక..ఈ రకమైన చర్యల వలన, మన సమాజం తమ చరిత్రను తెలుసుకోలేక, తిరగబడలేని స్థితికి చేరి, బానిసత్వాన్ని ఆనందంగా అనుభవించే ఒక చచ్చుబడిన, చేవలేని సమాజంగా మారిపోయింది..ఇలా బానిసత్వాన్ని హక్కుగా, బాధ్యతగా, కర్మగా భావిస్తున్న మన సమాజం., ''ఆనందాన్ని ఆత్మాభిమానంతో బ్రతకడంలో కాకుండా., ఆటవిడుపులో వెతుక్కుంటూ''.. జాతి ద్రోహులుగా మారి మన భావి తరాలను పూర్తి బానిసత్వంలోనికి నెడుతున్నారు.. 1818 డిసెంబర్ 31 శిరూరు క్యాంపు హెడ్ క్వార్టర్సును చేరిన బ్రిటిష్ దూత, అక్కడ అధికారిగా ఉన్న లెఫ్టినెంటు కల్నల్ ఫిల్స్మన్ కు సందేశం అందించాడు. కల్నల్ బార్టన్ పంపిన ఈ సందేశం సారాంశం "2వ బాజీరావు పీష్వా ఆధ్వర్యంలోని సైన్యం పూణాను చుట్టుముట్టి ఉంది., వారిని ఎదుర్కొనేందుకు తగిన సైనిక బలగాలు పంపమని".అప్పటికే తమ వద్ద తీవ్రమైన సైనిక కొరతతో భాధ పడుతున్న ఫిల్స్మన్ తీవ్ర సంగ్దిగ్ధంలో పడ్డాడు.. తక్కువ సంఖ్య అయినా అత్యధిక, అసమాన ధైర్య సాహసాలు గల సేనల అవసరం ఉంది.. అప్పుడే తన మెదడులో ఒక మెరికలాంటి ఆలోచన కలిగింది..1779 వద్గావ్ యుద్ధంలో మహాదాజీ షిండే నాయకత్వంలో పీష్వాల తరపున యుద్ధం చేసి, బ్రిటిష్ సైన్యాన్ని చిత్తు చిత్తుగా ఓడించినప్పటికీ ,కూడా,. పీష్వాల చేత సామాజిక అణిచివేతకు గురవడంతో తిరుగుబాటుగా బ్రిటీషు సైన్యంలో చేరిన 500 మంది మహార్ సైనికులతో ఏర్పాటు చేసిన బొంబాయి ఇన్ఫాంటరీ, మొదటి రెజిమెంటు, రెండవ బెటాలియన్ గుర్తుకొచ్చింది.. వెంటనే ఆ బెటాలియన్ అధికారి క్యాప్టెన్ స్టాటన్ కు వర్తమానం పంపారు..ఆ వర్తమానం అందిన క్యాప్టెన్ స్టాటన్, మహర్ సైనికులకు నాయికత్వం వహిస్తున్న సుబేదార్ శిద్దనాగ్ కు విషయం తెలియజేసి సహాయం కోరాడు.. పరదేశస్తుల తరపున పోరాడి సాటి భారతీయులతో యుద్ధం చేయడం ఇష్టం లేని శిద్ధినాగ్, కొంత సమయం కోరారు..ఈ సమయంలో పీష్వాల సైన్యాధికారి బాపు గోఖలేని కలిసి ఈ విధంగా అడిగారు.. "బ్రిటీషు సైన్యంతో కలిసి స్వంత దేశస్తుల మీద యుద్ధం చేయడం మాకు ఇష్టం లేదు.. యుద్ధం నిరాకరించి పీష్వాల విజయానికి తోడ్పడితే, స్వతంత్ర పీష్వా రాజ్యంలో మా పరిస్థితి ఏ విధంగా ఉంటుంది."దానికి సమాధానంగా, మనుస్మృతి మదంతో ఉన్న బ్రాహ్మణుడు బాపు గోఖలే, వికృతంగా నవ్వుతూ ఈ విధంగా జవాబు ఇచ్చాడు "మేం గెలిస్తే సాంప్రదాయంగా కొనసాగుతున్న వర్ణాశ్రమధర్మం మీకు ఇచ్చిన స్థానాన్నే పదిలపరచబడుతుంది". అన్నాడు..పీష్వాల పోరాటం భారత ప్రజలను విముక్తులను చేయడానికి ఏ మాత్రం కాదు.. నీచ బ్రాహ్మణ హైందవ వర్ణాశ్రమ ధర్మాన్ని కాపాడుకుని, మహర్ లను ఆర్థిక సామాజిక పీడనకు గురి చేయడానికేనని అర్థం అయిన శిద్దనాగ్, స్టాటన్ దగ్గరికి వెళ్ళి యుద్ధంలో పాల్గొనేందుకు సుముఖత వ్యక్తం చేసాడు..1818 డిసెంబర్ 31 శిద్దనాగ్ నాయకత్వంలో 500 మంది మహర్ సైనికులు, 250 మంది అశ్వదళం, 24 గన్నర్లతో బయలుదేరారు.. వెంటతెచ్చిన రేషను సరిపోక మిగిలిన బియ్యంతో గంజి పెట్టుకుని తాగి ముందుకు కదిలారు.. బెటాలియనుకు కోరేగావ్, గ్రామంలో(పూణాకు 30 కి.మి) భీమా నది ఒడ్డున., 28000 పదాతిదళం, 7000 మంది అశ్వదళంతో కూడిన పీష్వాల సైన్యం ఎదురైంది.దాదాపు 50 రెట్లు అధికంగా ఉన్న శత్రు సైన్యాన్ని చూసిన వెరవక, ముందుకు దూకింది మహార్ సైన్యం.. మధ్యాహ్నానికి తమ అశ్వదళం, గన్నర్లతో పాటు ఆహారం మోసుకొచ్చేవారు కూడా పారిపోయినా కూడా వెనకడుగు వేయకుండా, ఒక్కొక్క సైనికుడు 50 మందితో పోరాడడం చూసి, భయపడిపోయిన కేప్టన్ స్టాటన్ యుద్ధం ముగిసిందని ప్రకటించి తన సేనలను లొంగిపోమని ఆజ్ఞాపించాడు.అప్పుడు మహార్ సైన్యం నాయకుడు శిద్దనాగ్ నాయక్ ఈ విధంగా తీవ్ర స్వరంతో గర్జించాడు.."స్టాటన్ సాబ్.. మేం మహర్ (ద్రావిడ) జాతిలో పుట్టిన వాళ్ళం..చరిత్రలో మాకు అవకాశం వచ్చిన ప్రతీసారీ మేము ఏమిటో నిరూపించాం.., ఈ రోజు మాకు అవకాశం మళ్ళీ వచ్చింది.. వందల సంవత్సరాలుగా మమ్మల్ని బానిసలుగా మార్చి, చిత్ర హింసలకు గురి చేసి, పశువులకన్నా హీనమైన బ్రతుకులు అనుభవించేలా చేసిన ఈ బ్రాహ్మణ ఆధిపత్యంపై, బదులు తీర్చుకోవడానికి ఈ రోజు వచ్చిన ఈ అవకాశాన్ని మేం వదులుకోము.. మీరు యుద్ధం చేయవద్దు, భయపడకుండా చూస్తూ ఉండు.. మా అఖరి రక్తం బొట్టు పోయేదాకా మేం పోరాడతాము" అతని ఆత్మవిశ్వాసానికి ఆశ్చర్య పడిన కేప్టన్ స్టాటన్ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నాడు.. ఆహారం, నీరు కూడా లేకుండా ఆ రోజు ఒక రాత్రి ఒక పగలు, 18 గంటలపాటు కొనసాగిన భీకర యుద్ధంలో 500 మంది దళిత సైనికులు 28000 మంది పీష్వా సైన్యాన్ని ఊపిరి సలపనీయకుండా ఎదుర్కొన్నారు.. శిద్ధినాక్ చెప్పినట్టుగానే చావుకే భయం పుట్టించే విధంగా మహార్ సైనికులు అత్యంత కృరంగా పెష్వా సైనికులపై విరుచుకుపడ్డారు. పెష్వా సైనికులను నరకడం చూసి ఆ చావుకే భయమేసింది. 1818 జనవరి 1 మహార్ సైనికుల నుండి తమ ప్రాణాలు కాపాడుకోడానికి చెల్లాచెదురుగా పారిపోతున్నారు భీమానది రక్తంతో నిండిపోయింది. భీమానదిలో రక్తం ప్రవహిస్తుంది. సూర్యుడు అస్తమిస్తున్నాడు ఆ సమయంలో పెష్వా సేనాధిపతి బాపు గోఖలే కుమారుడి తలను దేహం నుండి వేరు చేసి బర్ఛికి వేలాడదీశాడు సిద్దనాగ్. తన కొడుకు తల లేని దేహాన్ని చూసి పిచ్చెక్కిన బాపు గోఖలే ప్రాణాలు కాపుడుకోవడానికి పరుగులు తీశాడు. బాపు గోఖలే ను సిద్దనాగ్ వెంటాడి అతని తలను నరి కాడు భయకంపితులైన పీష్వా సైన్యం, ఫూల్గావ్ లోని బాజీరావు శిభిరం వైపు పరుగులు తీయసాగారు వారిని భీమా నది దాటేదాకా తరిమి కొట్టి సిద్దనాగ్1818 జనవరి 1న విజయకేతనం జెండాను ఎగరవేశాడు. మహర్ సైన్యం.23 మంది మహర్ వీరులు ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోగా అయిదుగురు గాయపడ్డారు దీనితో పెష్వాల రాక్షస పాలన అంతమయింది...ఇది ఆంగ్లో ఇండియన్ యుద్ధం కాదు పెష్వా బ్రాహ్మణుల రాక్షస పాలనకు మరియు అంటరాని కులాల మానవ హక్కుల కొరకు జరిగిన పోరాటం..చరిత్రలో ఈ ఘటనకు బ్రిటిష్ వారి ఆధిపత్యాన్ని సంపూర్ణం చేసిన ఆంగ్లో-మరాఠా యుద్ధంగా చెబుతారు ఈ మనువాద చరిత్రకారులు.. కానీ నిజానికి సమానత్వం కోసం, మానవ హక్కుల కోసం మహర్ సైనికులు చేసిన ఒక వీరోచిత యుద్ధం ఇది.. కానీ ఈ వీరత్వం నుండి స్పూర్తి పొంది, ఆ వీరుల వారసులు తమ శక్తి యుక్తులను గుర్తించి ఈ నీచ మనువాద బ్రాహ్మణత్వంపై తిరుగుబాటు చేస్తే.. తమ పరిస్థితి ఏమౌతుందో ముందే ఊహించి, తమకే పరిమితమైన చదువును అడ్డం పెట్టుకుని నిజమైన చరిత్రను పూర్తిగా నిర్వీర్యం చేసి, వక్రీకరణ చేసిన అబద్ధాలను చరిత్రగా పొందుపరచబడ్డాయి..యుద్ధానంతరం జనవరి 02 న జనరల్ స్మిత్ యుద్ధ భూమి ప్రాంతాన్ని చూడటానికి వెల్లాడు. అక్కడ పరిస్థితులు చూస్తే పెష్వా బ్రహ్మణ సైనికుల శవాలు ఎక్కిడిక్కడ చెల్లా చెదారుగా పడి ఉన్నాయి. అక్కడ కొంతమంది శవాలను కుప్పలు కుప్పలుగా కాలుస్తున్నారు. తన జీవితంలో ఇటువంటి భయంకర దృశ్యాలు ఎన్నడూ చూడలేదు అని మహార్ సైనికుల యొక్క వీరత్వాన్ని ప్రశంసిస్తూ తమ అధికారులకు ఉత్తరం రాశాడు. బ్రిటిష్ ప్రభుత్వం ఆ యుద్ధం లో అమరులైన 22 మంది మహర్ సైనికులకు గుర్తుగా 50 అడుగుల స్తూపాన్ని

ఈ చరిత్రకు సాక్ష్యంగా 1821లో కొరేగావ్ గ్రామంలో యుద్ధం జరిగిన ఆ ప్రాంతంలో "విజయస్తూపం" ఏర్పాటు చేసింది బ్రిటీషు ప్రభుత్వం. యుద్ధంలో ప్రాణత్యాగం చేసిన 23 మహర్ పేర్లను ఆ విజయ స్థూపంపై చెక్కించి ప్రతి సంవత్సరం వారికి నివాళి అర్పించేది..తరువాత స్వతంత్రానికి ముందు ఈ బ్రాహ్మణ వ్యవస్థతో జరిగిన రహస్య అధికార బదిలీ ఒప్పందానికి తల వంచిన బ్రిటిష్ ప్రభుత్వం ఆర్ధిక పరిస్థితిని సాకుగా చూపి అంటరాని వారిని సైన్యం, పోలీసు విభాగాలలో చేర్చుకోకూడదని 1927 లో నిర్ణయం తీసుకుంది%ో% ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకించిన బాబాసాహెబ్ ''ఇది పోరాట యోధుల చరిత్రను కనుమరుగు చేసే కుట్ర'' అంటూ, విజయ స్థూపం వద్ద ప్రదర్శనకు పిలుపునివ్వడంతో దేశ నలుమూలల నుండీ లక్షలాది ప్రజలు హాజరైయ్యారు..అప్పటి నుండీ చనిపోయేదాకా కూడా ప్రతి సంవత్సరం జనవరి 1న బాబాసాహెబ్ తప్పకుండా విజయ స్థూపాన్ని సందర్శించి నివాళులు అర్పించేవారు.. బాబాసాహెబ్ తదనంతరం ఆయన ఆలోచనా విధానాన్ని కొనసాగించే బాధ్యత తీసుకున్న "సమతా సైనిక్ దళ్" అంబేద్కర్ రైట్స్ ఇప్పటికీ ప్రతీ సంవత్సరం జనవరి 1వ తేదీన వేల సంఖ్యలో హాజరై నివాళులు అర్పిస్తూ చరిత్రను కాపాడుకుంటూ వస్తుంది.మన చరిత్రను కాపాడుకోవడం మన బాధ్యత చావుకే వెన్నులో వణుకు పుట్టించిన మనం ..ఈ నాడు మన అక్క చెల్లెళ్ళను బట్టలు విప్పి ఊరేగించి ఊరంతా కలిసి అత్యాచారం చేసినా తిరిగి నోరెత్తడానికి భయపడుతున్నాం...మన పిల్లలను ఇంట్లో బంధించి నిప్పు పెట్టినా ఏడుస్తూ కూర్చుంటున్నాం... మనకు ఇట్టమైన చదువులు చదివే స్థితిలో మనం లేము..మనకిష్టమైన బట్ట కట్టుకుని తిరిగే పరిస్థితిలో లేము..మనకు ఇష్టమైన తిండిని కూడా ధైర్యంగా తినలేకపోతున్నాం...ఎంత ఆర్ధిక స్థితిమంతులం అయినా ఆత్మాభిమానం ప్రదర్శిస్తే దాడులు ఎదుర్కొంటున్నాం..శత్రువులతో చేతులు కలిపి మన మీద జరుగుతున్న దాడులను, ఆదాయ వనరులుగా, రాజకీయ ఎదుగుదలకు వాడుకుంటూ ఆత్మాభిమానాన్ని తాకట్టు పెడుతున్న కోపర్టుల మన శక్తిని నిర్వీర్యం చేస్తన్నా మనం వారికి జేజేలు కొడుతున్నాం..ఇంత అన్యాయాలకు గురై, న్యాయం చేయండి మహాప్రభో అని రోడ్డెక్కి దేబురించి అడుక్కుని, తన్నులు తినే నీచమైన హీన స్థితికి దిగజారడానికి కారణం ఎవరు? 40% మనువాద బ్రాహ్మణత్వ పెత్తందారులు అయితే, 60% మన స్వయంకృతాపరాధం కాదా?? బాబాసాహెబ్ చేసిన త్యాగాల ద్వారా, మెరుగైన ఆర్థిక స్థితిని పొంది, ఆత్మాభిమానంతో కూడిన జీవితం పొందిన ఈనాటి సమాజం, తమ చరిత్రను తెలుసుకోకుండా, శతృ వ్యవస్థ పన్నిన ఉచ్చులో పడి.. కేవలం ఆటవిడుపులోనే ఆనందం వెతుక్కుంటూ మన పూర్వీకులు మనకు సంపాదించి ఇచ్చిన ఆత్మాభిమానాన్ని పూర్తిగా విస్మరిస్తున్నారు..కొత్త సంవత్సరం పార్టీలు అంటూ మన చరిత్రను మననం చేసుకునే ఖాళీ కూడా లేకుండా క్లబ్., పబ్ లలో తాగి ఎగరడానికి తమ సమయం, డబ్బు వృధా చేస్తుకుంటూ ఉండడం మన దళిత బహుజన జాతి దౌర్భాగ్యం..ఇప్పటికైనా కళ్ళు తెరుద్దాం..కొత్త సంవత్సరం సంబరాలు కాదు..గర్వంగా భీమ్ కోరేగావ్ మానవహక్కుల విజయోత్సవాలు చేసుకుందాం.ఆనందం అంటే ఆటవిడుపు కాదు..

ఆనందం అంటే ఆత్మాభిమానంతో బ్రతకడం

**రవివర్మ పాలడుగు**
**వ్యాసకర్త సామాజిక విశ్లేషకులు**
**9704722470**

# పేదరిక నిర్మూలన, స్వయం సాధికారత యంత్రీకరణతో సాధ్యం





అనంతపురం : దక్షిణ భారత యంత్ర శిక్షణ మరియు పరీక్షణ సంస్థలో ఒక్క రోజు వ్యవసాయ పనిముట్ల పనితీరు పై వర్కుషాప్ జరిగినది. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా యం. సురేష్ బాబు మాట్లాడుతూహొదేశవ్యాప్తంగా గత రెండేళ్లుగా ఇంజనీరింగ్ విద్యలో గణనీయమైన మార్పులు చోటు చేసుకున్నాయి. కంప్యూటర్ అనుబంధ కోర్సులు పూర్తిగా పైచేయి సాధిస్తు న్నాయి. ఫలితంగా కొన్ని బ్రాంచ్‌ల్లో సీట్లు అనివార్యంగా తగ్గించాల్సి వస్తోంది. భవిష్యత్‌లో కోర్ బ్రాంచీలు పూర్తిగా తెరమరుగయ్యే ప్రమాదం ఉందని అన్నారు. సామాజిక పరిస్థితుల నేపథ్యమే దీనికి ప్రధాన కారణమనే వాదన విన్పిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం రాజ్యమేలుతోంది. సాంకేతికత లేకుండా ముందుకెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు మెకానికల్‌కు సీఎస్ఈకి సంబంధం లేకున్నా ఏదైనా వాహనాన్ని డిజైన్ చేయాలంటే ముందుగా సాంకేతిక టెక్నాలజీతోనే చేస్తారు. కంప్యూటర్ టెక్నాలజీతోనే దాని సామర్థ్యాన్ని పరిశీలిస్తారు. ఆ తర్వాతే హార్డ్‌వేర్‌తో అవసరం. అలాగే ఎలక్ట్రానిక్స్‌తో రూపొందించే టీవీల తయారీలోనూ అత్యాధునిక ఐవోటీ టెక్నాలజీ కీలకం.సివిల్‌లోనూ ఇదే ధోరణి. నిర్మాణాల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ముందుగా వినియోగించాలి. మానవ జీవితంలో అంతర్భాగమైన ఇంటర్నెట్‌ను గుప్పిట్లో పెట్టుకునేది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్. డేటాసైన్స్ ఉపయోగమూ అంతా ఇంతా కాదు. దీంతో కంప్యూటర్ అనుబంధ కోర్సులకు అత్యధిక ప్రాధాన్యం ఏర్పడిందన్నారు. సంస్థ సంచాలకులుహొడా పి. పి రావు మాట్లాడుతూ నీడ్ బేస్ కోర్సుల ద్వారా వృత్తి నైపుణ్యాలు పెంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వ్యవసాయ యంత్రీకరణ సంబంధించి తమ అవసరాలకు అనుగుణంగా వివిధ వ్యవసాయ యంత్రాల ఎంపిక వాటి వినియోగం పై తగిన శిక్షణ , మరమ్మతులు ఉపయోగపడే విధానాలు, ట్రాక్టర్ల, డీజల్ ఇంజిన్లు, పవర్ టిల్లర్లు ఆటో ఎలెక్ట్రిక్ వరికరాల, బ్యాటరీల మర్మత్తులపైశిక్షణ తమ సంస్థ ప్రధాన ఉద్దేశం అని అన్నారు. డా నవీన్ కుమార్ పెద్దరాజు మాట్లాడుతూ ఇలాంటి శిక్షణ పేదరిక నిర్మూలనకు, అలాగే ఉపాధి కల్పించే విధంగా ఉంటూ రైతులకు సంతృప్తి ఇచ్చే విధంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ ఇంజినీర్ కమల బాయి, ఇంజినీర్లు ముకేశ్, మౌలా, హరినాథ్ రెడ్డి, టి నరసింహులు, షబానా, రవి తేజ, మోహన్, ఫర్హానా తదితరులు పాల్గొన్నారు.

## చరిత్ర తెలిసిన విద్యవంతులైతేనే రాజ్యాధికారం సాధ్యం

### బహుజన ఆత్మీయ సమావేశంలో వక్తల అబిప్రాయం



విశాఖ పశ్చిమ (ప్రజాపాలన) దళిత, బహుజనులంతా చరిత్ర తెలిసిన విద్యావంతులైనప్పుడే రాజ్యాధికారం సుసాధ్యం అవుతుందని, బహుజన ఈవెంట్ లతో కాకుండా బహుజన చైతన్యంతో ప్రశ్నించినప్పుడే పాలకులు కాగలరని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. గురువారం విశాఖ సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ దగ్గర మామిడి తోటలో దళిత బహుజన సేన ఆత్మీయ సమావేశమైన వారిని చైతన్య వంతమైయ్యే విధంగా వక్తలు ప్రసంగిచారు. అనంతరం యువకులు, మహిళలు, పిల్లల్లో ఆటో పాటలతో ఉల్లాసంగా సాగింది. దళిత బహుజన సేన వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చింతా సూర్యం స్వాగతోపాన్యాసంతో జరిగిన సమావేశంలో వినయ్ అధ్యక్షత వహించారు. రాజకియాలకు అతీతంగా బహుజనులు ఐక్యత, రాజ్యాధికార సాధనకై చైతన్యం చేయడమే ఉద్దేశం అన్నారు. సమావేశంలో ఆట,పాటలతో ఉల్లాసంగా ఉత్సాహంగా సాగిన కార్యక్రమంలో దళిత బహుజన సేన రాష్ట్ర కమిటీ గాంధి రాజేశ్వరి, నగర అధ్యక్షుడు రెల్లి త్రినాథ్, కొమ్మి వీర్రాజు, తెల్లని శ్రీనివాస్, అనపర్తి అప్పారావ్, పెద్ద పాటు ధనలక్ష్మి, బొడ్డు రమణ జెర్రిపోతుల పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

## డిసెంబర్ 31, జనవరి 1 తేదీల్లో వేడుకలకు అనుమతి లేదు...




అమలాపురం : ప్రజలందరికి విజ్ఞప్తి కరోనా (ఒమిక్రాన్) ప్రభావము ఎక్కువగా ఉన్నందున నూతన సంవత్సర పడుకలకు జరుపుకొనుటకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని అమలాపురం అర్డీఓ వసంత రాయుడు తెలిపారు. . ప్రస్తుతము మన అమలాపురం డివిజన్ పరిదిలో అయినవిల్లి మండలం, నేదునూరు గ్రామంలో ఒక కేసు, రావులపాలెం మండలం, ఉబలంక గ్రామములో మూడు ఒమిక్రాన్ కేసులు రిపోర్టుఅయినాయన్నారు . ఓమిక్రాన్ కొంటాక్ట్ చాలా ఎక్కువగా ఉన్నవి. ఇది చాలా వేగంగా వ్యాప్తి చెందుతున్నదని అందుకు అందరూ జాగ్రత్తగా ఉండాలి, అనవసరంగా ఎవ్వరూ బయట తిరుగరాదని అర్డీఓ చెప్పారు.. విధిగా మాస్క్ లు ధరించి నూతన సంవత్సర వేడుకలు ఎక్కువ గుమిగూడి జరుపుకొనుటకు ఎటువంటి అనుమతులు లేవన్నారు.. కావున అందరూ తమ తమ కుటుంబ సభ్యులతో, వారి వారి ఇంటి వద్దనే నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని అర్డీఓ వసంత రాయుడు విజ్ఞప్తి చేశారు. 5. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా మీరు మీ స్నేహితులకు గాని పరిచయస్థులకు కరచాలనములు ఇవ్వరాదు. అందరూ నమస్కారములతో నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియపరుచుకోవాలన్నారు.

## దాతలు దాతృత్వంలో సహకరిస్తూ కళ్యాణ మండపం అభివృద్ధి కృషిచేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు..



గుడివాడ : దాతలు దాతృత్వంలో సహకరిస్తూ కళ్యాణ మండపం అభివృద్ధి కృషిచేసిన ప్రతి ఒక్కరిని అభినందిస్తున్నాని రాష్ట్ర డిప్యూటీ సీయం, రెవెన్యూ శాఖమంత్రి ధర్మాన కృష్ణదాస్ అన్నారు. స్థానిక శ్రీరామపురం గౌతమబుద్ధ హాస్టల్ స్థలంలో రూ. కోటి 20 లక్షలతో నిర్మించిన వెలమ సంక్షేమ సంఘ భవనాన్ని డిప్యూటీ సీయం, రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన కృష్ణదాస్, రాష్ట్ర పౌరసరఫరాలు శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)తో కలసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీయం రెవెన్యూ శాఖమంత్రి ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ వెలమ సంక్షేమ సంఘ నూతన భవనానికి దాతృత్వంతో దాతలు సహాయం మరువలేనిదన్నారు. వెలమ సంక్షేమ సంఘం అభివృద్ధికి తన వంతుగా సహాకారంగా రూ.3 లక్షలు విరాళాన్ని అందిస్తున్నాని ప్రకటించారు. రాష్ట్ర పౌరసరఫరాలు వినియోగదారుల వ్యవహారాలు శాఖ మంత్రి కొడాలి శ్రీ వెంకటేశ్వరరావు(నాని) పెద్ద మనస్సుతో వెలమ సంక్షేమం సంఘం అభివృద్ధికి మరో నూతన భవన నిర్మాణానికి స్థలం అందిస్తానడం శుభపరిణామం అన్నారు. రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) మాట్లాడుతూ. గుడివాడ పట్టణంలో వెలమ సంక్షేమ సంఘ భవన నిర్మాణానికి 2 వేల గజాల స్థలాన్ని ఇప్పిస్తానని సంఘీయులకు హామీ ఇచ్చానని తెలిపారు. వెలమ సంఘీయులు రూ. కోటి 20 లక్షల విరాళాలను సేకరించడం సామాన్యమైన విషయం కాదన్నారు. భవన నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు ఎమ్మెల్యే మేకా ప్రతాప్అప్పారావు, నవరత్నాలు అమలు కమిటీ వైస్ చైర్మన్ అంకమరెడ్డి నారాయణమూర్తి, మాజీ మంత్రి మరడాని రంగారావు, వెలమ కార్పోరేషన్ డైరెక్టర్లు జి.మాధవి, జి.శ్రీనివాసరావు, నవుడు వెంకటరమణ, గుడివాడ వెలమ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, అధ్యక్షుడు గంటా ఆనంద్, ప్రధాన కార్యదర్శి గులిపల్లి ప్రభాకరరావు, వైసీపీ రాష్ట్ర నేత దుక్కిపాటి శశిభూషణ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, నాయకులు పాలడుగు రాంప్రసాద్, వల్లూరుపల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# పచ్చకామెర్ల వ్యాధి ఉన్నవారికి లోకమంతా పచ్చగా ఉంటుంది



నరసరావుపేట. ప్రజాపాలన : నరసరావుపేట టీడీపీకి ముందు ఆయన ఇంచార్జి గానే ఉన్నారో లేదో తెలుసుకునే ప్రయత్నం లోనే ఆయన ఇలా అసత్య ఆరోపణల తో మాట్లాడుతున్నట్లుగా ఉంది. తెలుగుదేశం హాయాంలో ఇక్కడా- అక్కడా ఉన్న నాయకులు, ఇంఛార్జీలు రాష్ట్రం మొత్తం ప్రజలను, వ్యాపారులను ఎంత గా ఇబ్బంది పెట్టారో అందరికి తెలుసు. ముఖ్యంగా, నరసరావుపేట లో 2014 నుండి 2019 వరకు టీడీపీ వారు ఎంతగా ప్రజలను, వ్యాపారులను పీడించారో అరవింద్ బాబు మరచిపోయినట్లున్నారు. ఇప్పటికీ ఆ బాధితులు ఆ బాధలో నుండి బయటకి రాలేదు. 2019 నుండి నేటి వరకు కూడా నరసరావుపేట ఎంత గా అభివృద్ధి చెందిందో నలువైపులా తిరిగి చూస్తే అర్థం అవుతుంది. నరసరావుపేట నియోజకవర్గ పరిధిలో ప్రతీ పేద కుటుంబం కూడా ఇల్లు ఉండాలి అని లక్ష్యంతో పని చేస్తున్నారు మన ప్రియతమ నాయకులు గోపిరెడ్డి గారు, అదే విధంగా పారిశుధ్యం విషయంలో గానీ, ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే విషయంలో గానీ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నరసరావుపేట ను తన సొంత కుటుంబం లా భావించి, ఇక్కడ నివసించే ప్రతీ వారు కూడా సంపూర్ణ ఆరోగ్యకరమైన మరియు ప్రశాంత జీవనంకు కావాల్సిన ప్రతీ ప్రాజెక్టు ని నరసరావుపేట నియోజకవర్గం కు తీసుకు రావటానికి ఎంత కృషి చేస్తున్నారో ప్రజలందరికీ బాగా తెలుసు. విద్య కోసం %జీత్‌బ% నిర్మాణ పనులు, కేంద్రీయ విద్యాలయం తీసుకురావటం, ఆరోగ్యం కోసం లింగంగుంట్ల లో హాస్పిటల్ ఓపెన్ చేయించటం, ప్రతీ వార్డ్ లో, ప్రతీ గ్రామంలో ప్రజల ముందుకు వారి వారి జీవన విధానం సక్రమంగా సాగటానికి అవసరమైన సచివాలయ వ్యవస్థ, ప్రతీ ఇంటికి ఒక వలేంటీర్, రైతుల కోసం భరోసా కేంద్రాలు, village క్లినిక్స్ ప్రతీది ప్రజలకు చేరువ చేయటం అరవింద్ బాబు కి కనిపించడం లేదా!!!అరవింద్ బాబు ఉనికిని చాటుకోవడం కోసం చేసే విమర్శలు సరైన పద్ధతి కాదు. ఇలా అర్థం పర్థం లేని ఆరోపణలు చేస్తే ఈ సారి ప్రజలు ప్రతిపక్ష స్థానం కూడా ఇవ్వరు వాళ్ళకి.ప్రజలు సంతోషంగా ఉండటం ఇష్టం లేకనే, ప్రజా ప్రభుత్వాన్ని చూసి ఓర్వలేకనే ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ-అభివృద్ధి పనులను టీడీపీ వారు చెడగొట్టే పనులు చేస్తున్నారు...



## శిరీష భాయి కి జయ జయ సాయి ట్రస్ట్ వారి బేస్ట్ సర్వీస్ అవార్డు

చిలకలూరిపేట: జయ జయ సాయి ట్రస్ట్ ఆధ్వర్యములో ప్రముఖ సంఘ సేవకురాలు బాణవత్ శిరీష భాయి కి %×ూా%9001-2015 అంతర్జాతీయ గుర్తింపు పొందిన జయ జయ సాయి ట్రస్ట్ వారు నేషనల్ బెస్ట్ సర్వీస్ అవార్డు ను అందజేశారు.,గత 5 సంవత్సరాల గా పేదలకు దుప్పట్లు,అన్నదాన కార్యక్రమలు నిరవహిస్తూ తన సంపాదనలో సగం భాగం సామాజిక సేవా కార్యక్రమాలు కు ఖర్చు చేస్తూ ఉన్న ఆమెను ట్రస్ట్ వారు గుర్తించి అవార్డ్ ను అందజేశారు,అనంతరం గురువారం సందర్భముగా ప్రత్యేక పూజలు జరిగినాయి,పుల్లెటికుర్తి కృష్ణ ఆర్థిక సహకారంతో 100 మంది పేదలకు అన్నదాన కార్యక్రమం నిరవహించారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి,బీసీ యునైటెడ్ ఫ్రంట్ పార్టీ అధ్యక్షుడు వేముల శ్రీనివాసరావు,రాష్ట్రీయ జన క్రాంతి పార్టీ రాష్ట్ర అధ్యక్ష్యులు షైక్ గౌస్, కంపౌంధర్ అసోసియేషన అధ్యక్ష్యులు కొండ్రముట్ల నాగేస్వరావు,విశ్వబ్రాహ్మణ సంఘ నాయకులు మానేపల్లి సుధాకర్,చర్మకారుల సంఘ నాయకులు సలికినీడి నాగరాజు,తదితరులు పాల్గొన్నారు,ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజి మాట్లాడుతూ సేవను గుర్తించి పురస్కారాలు అందజేస్తున్నామని,ప్రతిభ కలిగినవారిని,సేవ చేసేవారికి ప్రోత్సహం ఇస్తే మరి అన్ని సేవ కార్యక్రమాలు నిరవహించి పేద ప్రజలను అదుకుంటారని తెలిపారు.

## మల్లేశ్వరి కాయానికి నివాళులు అర్పించిన మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట: మండలం గొట్టిపాడు గ్రామనికి చెందిన మంద మల్లేశ్వరి మృతి చెందారు.వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు. ఈ కార్యక్రమంలో లో చిలకలూరిపేట మండలం అధ్యక్షులు జవ్వాజి మదన్, యడ్లపాడు మండలం అధ్యక్షులు ముద్దన నాగేశ్వరావు, గుర్రం నాగ పూర్ణచంద్ర రావు, ఆంజనేయులు మరియు గ్రామ నాయకులు పాల్గొన్నారు.బద్దేటి శ్రీనివాసరావు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి పత్తిపాటి పుల్లారావు.యడ్లపాడు మండలం, మైదవోలు గ్రామంలోని బద్దేటి శ్రీనివాసరావు ఇటీవల మృతి చెందడం జరిగింది. వారి ఇంటికి వెళ్లి శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, మాజీ మంత్రి శ్రీ ప్రత్తిపాటి పుల్లారావు ఈ కార్యక్రమంలో నెల్లూరి సదాశివరావు , యడ్లపాడు మండలం అధ్యక్షులు ముద్దన నాగేశ్వరరావు , చిలకలూరిపేట మండలం అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్ , గంగా శ్రీనివాస్ రావు , పోతురాజు , శివ కోటి పలువురు గ్రామ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## 2022 జనవరి 26 నుంచి అందుబాటులో కి రానున్న సరికొత్త పోర్టల్లి: ఎల్ డి ఓ పి.జగదాంబ



విజయువాడ ప్రజాపాలన ప్రతినిధి : గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో" ఈ-సేవలు %ఒ% కొత్త పౌర సేవా పోర్టల్" పై కొవ్వూరు డివిజనల్ స్థాయిలో రెండో విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదాంబ మాట్లాడుతూ, మెరుగైన పౌర సేవలు అందించడంలో డిజిటల్ అసిస్టెంట్ లు, విఆర్వో లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, అర్బన్ ఏరియా - డిజిటల్ అసిస్టెంట్‌లందరికీ పాత్ర ఎంతో కీలకమైన దన్నారు. అందులో భాగంగానే క్షేత్ర స్థాయి సిబ్బందికి శిక్షణ అందిస్తున్న ట్లు పేర్కొన్నారు. మాస్టర్ శిక్షకులు మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం మరింత మెరుగ్గా , పారదర్శకంగా పౌర సేవాలను అందించేందుకు దశల వారీగా పౌర సేవలు మెరుగు పరచడమే ప్రధాన ల 130 పైగా రెవెన్యూ, మునిసిపల్, మెడికల్, పౌర సరఫరాలకు చెందిన పౌర సేవలను "26.01.2022న ప్రజలకు అందుబాటులో కి తీసుకుని వొస్తున్నట్లు తెలిపారు. ఈ-సేవలు %ఒ% కొత్త పౌర సేవా పోర్టల్" సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింతగా మెరుగ్గా నిర్వహించేందుకు , సమస్యలు పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో సిబ్బంది పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. అందులో భాగంగానే ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ తరగతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రెండో రోజు జరిగిన డివిజనల్ స్థాయి శిక్షణ కార్యక్రమంలో అదనపు జిల్లా కో-ఆర్డినేటర్, బాలకృష్ణ, మాస్టర్ ఆఫ్ ట్రైనర్ ఎండి. ఆలీ, డిజిటల్ అసిస్టెంట్ ఎస్ఆర్వి ఎం ప్రభాకర్, వార్డ్ ఎడ్యు. %ఒ% డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ , ఎం.రాజేశ్వరరావులచే సాంకేతిక అంశాలపై కొవ్వూరు (అర్బన్), నిడదవోలు(అర్బన్), నిడదవోలు-రూరల్, తణుకు-రూరల్, కొవ్వూరు రూరల్, పెనుమంట్ర, పెనుగొండ, ఇరగవరం మండలాలకు చెందిన 230 మంది సచివాలయ , తదితర మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## మున్సిపల్ పాఠశాలలో ఘనంగా "బాషోత్సవాలు"

చిలకలూరిపేట:రాష్ట్ర ప్రభుత్వం గత నాలుగురోజుల నుండి 1-10తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు బాషా సామర్థ్యాల పెంపొందించడానికై సమగ్ర శిక్షా అబియాన్



ఆధ్వర్యంలో బాషోత్సవాలను నిర్వహిస్తుందని చిలకలూరిపేట మున్సిపల్ ప్రాథమిక పాఠశాల సూపర్ వైజర్ పోటు. శ్రీనివాసరావు అన్నారు.గురువారం డాక్టర్ మర్రిచెన్నారెడ్డి మున్సిపల్ ప్రాథమికపాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించారు. మాతృభాషలో పట్టు సాధిస్తేనే అన్ని సబ్జెక్టులలో మంచి ప్రావీణ్యం సంపాదించవచ్చని విద్యార్థుల కు సూచించారు. బాషద్వారానే సంస్కృతి అభివృద్ధి జరుగుతుందన్నారు. బాష ద్వారానే స సంబంధాలు పెంపొందుతాయి అన్నారు .అన్ని తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు తరగతులవారీగా తెలుగు,పద్యాలు గేయాలను శ్రావ్యంగా పాడటం,ఇంగ్లీష్ రైమ్స్ లో పోటీలు నిర్వహిం చారు. పోటీలలో ప్రథమ,ద్వితీయ, తృతీయ స్థానాలను పొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్ చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఏ.నీలిమ వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ. కామేశ్వరరావు, పేరెంట్స్ కమిటీ వైస్ ఛైర్మన్న షాకీలా,సభ్యులు,రత్నకుమారి,సంధ్యారాణి,ఐ.ఈ.డి ఉపాధ్యాయులు విశ్వప్రసాద్, అన్నేగ్రేస్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కొత్త సంవత్సర వేడుకలు.. టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలి



చిలకలూరిపేట:పట్టణ ములోని మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలు నిర్వహించబడును. ఉదయం 9.00 గంటలకు ప్రత్తిపాటి పుల్లారావు కేకును కట్ చేయడం జరుగును. అనంతరం అల్పాహారం విందు, భోజన ఏర్పాటు జరుగును. నూతన సంవత్సరం సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసే వారు కోవిడ్ నిబంధనలు పాటిస్తూ ప్రతి ఒక్కరు కూడా మాస్కును తప్పనిసరిగా ధరించాలి, శానిటైజర్ ను ఉపయోగించి ప్రభుత్వ నిబంధనలను పాటించాలని తెలియజేశారు. మూడు మండలాలు, పట్టణంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ తప్పక హాజరు కావలసిందిగా కోరుతున్నాము. ఈ పత్రికా ప్రకటన చేసిన వారిలో పట్టణ ప్రధాన కార్యదర్శి పఠాన్ సమద్ ఖాన్ , చిలకలూరిపేట రూరల్ మండల అధ్యక్షులు జవ్వాజి మదన్ మోహన్, నాదెండ్ల మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, యడ్లపాడు మండల అధ్యక్షులు ముద్దన నాగేశ్వర రావు ఉన్నారు.

## మున్సిపల్ ఎన్నికల విజయానికి అందరూ కృషి చేయాలి: బీదా రవిచంద్ర, అబ్దుల్ అజీజ్



కావలి, డిసెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి : త్వరలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల విజయానికి అందరూ కృషి చేయాలని నెల్లూరు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు అబ్దుల్ అజీజ్, జాతీయ ప్రధాన కార్యదర్శి పేద రవిచంద్ర పేర్కొన్నారు.గురువారం కావలి లోని రామ్మూర్తి పేట సాయి బాబా గుడి వద్ద గల కావలి నియోజకవర్గ తెదేపా కార్యాలయం లో రాబోవు కావలి, అల్లూరు మునిసిపల్ ఎన్నికల గురించి కావలి నియోజకవర్గ స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కావలి లో నాయకులు చెల్లాచెదురు అయినా టీడీపీ కార్యకర్తలు బలమైన పునాదుల్లా నిలబడ్డారని తెలిపారు. బూత్ లెవెల్ స్థాయి నుంచి తెదేపా కమిటీ లు వేసుకుని, పార్టీ నీ బలోపేతం చేయాలని, మన సొంత బిడ్డల గురించి ఎంత జాగ్రత్త తీసుకుంటామో పార్టీ కమిటీల గురించి కూడా అంతే జాగ్రత్తలు తీసుకోవాలి తెలియజేశారు. ఇప్పటి వరకు పోరాటాలు చేశామని ఇక మీదట ఎన్నికల వ్యూహం తో ముందుకు సాగాలని, కోర్టు లో కేసు నడుస్తుందని పేర్కొన్నారు. అప్పుడే ఎన్నికలు రావు అనుకోకండని ఎన్నికలు ఎపుడు వచ్చినా మనం అందరం సంసిద్ధంగా ఉండాలి తెలియజేశారు. ప్రలోభాలకు బెదిరింపులకు లొంగని వారిని అభ్యర్థులు గా నిలబెట్టుకుందామని సూచించారు. మునిసిపల్ ఎన్నికలు రేపు ఉదయం వచ్చినావాటికి సిద్ధంగా ఉండాలని చెప్పారు. వైకాపా నాయకులు చేసేది ధర్మ యుద్ధం కాదని అధర్మ యుద్ధంగా పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా తెలుగుదేశం పార్టీ నాయకులపై కార్యకర్తలపై సానుభూతి పరుల పై దాడులు జరుగుతున్నాయని,వ్యాపారస్తులను వ్యాపారపరంగా, రైతులను భూములు పరంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలియజేశారు. ఎన్నికలు జరిగేది మన ఊరిలో కాదు కదా అని అనుకోకుండా ప్రతి ఒక్కరూ, ప్రతి టీడీపీ నాయకుడు, కార్యకర్తలు ఎన్నికల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.నెల్లూరు ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని, కావలి ఎన్నికలను ఒక ఛాలెంజ్ గా తీసుకోవాలని తెలిపారు. వైకాపా లో ఉండేది క్రూర మృగాలని వారిని వెంటాడి, చేదించే శక్తి టీడీపీ కార్యకర్తలకు ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు గూడపాటి శ్రీనివాస్, పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, సుబ్బా నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కోట బుచ్చయ్య సంస్మరణ కార్యక్రమానికి హాజరైన ప్రముఖులు: ఉదయభాను మొండితోక అరుణ్ కు మార్ వసంత కృష్ణ ప్రసాద్



చందర్లపాడు డిసెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి: వై స్సార్సీపీ సీనియర్ నాయకులుజిల్లా ప్రధాన కార్యద ర్శికోట బుచ్చియ్య ఇటీవల మృతుచెందారు.అయన సంస్మరణ సభలో ఎమ్మెల్సీ డా"మొండితోక అరుణ్ కుమార్ జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయ భాను మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ .విజ యవాడ తూర్పు నియోజకవర్గం వైస్సార్సీపీ ఇంచార్జి దేవినేని అవినాష్ కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరావు పాల్గొని బుచ్చియ్య చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి భరోసా ఇ చ్చారు.

## కెవిఆర్ పాఠశాలలో ఘనంగా తెలుగు భాషోత్సవాలు



పెనుగంచిప్రోలుడిసెంబర్30ప్రజాపాలనప్రతినిధి:పెనుగంచిప్రోలు కెవిఆర్ ఉన్నత పాఠ శాలలో తెలుగు భా షోత్సవాలు ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు జ ల జ మాట్లాడుతూ భాష పట్ల అభిమానం పెంచుకోవాల ని , భాష మన జాతి ఉనికి అన్నారు. ఉపాధ్యాయ ర చయిత ముక్కా సత్య నారాయణ మాట్లాడుతూ గ్రా మంలో పుట్టిన తెలుగు కవుల గురించి వివరించారు. భాషో పాధ్యాయులు నల్లూరి పద్మ , సౌందర్య, రాము నా యక్ ల అధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పా టలు, నృత్యాలు ప్రదర్శించారు. తెలుగు తల్లి వే షధా రణలో విద్యార్థిని గుంటుపల్లి చందన ఆకట్టు కుంది. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థు లు ఉత్సాహంగా పాల్గొన్నారు


### స్నేహ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటి లిమిటెడ్

PAY BACK TO SOCIETY SNEHA CLUB — SNEHA MACS

గత 20 సం॥లు గా సమాజ మార్పుకోసం కంపెనీకి వచ్చే లాభాలను పేదప్రజల కనీస అవసరాల కోసం ఖర్చు చేస్తూ సోషల్ ఇంజనీరింగ్ చేస్తున్నాం.

SCHEDULE OF INTEREST RATES ON FIXED & R.D. ACCOUNTS

| Term | General | Senior Citizens |
|---|---|---|
| 180 Days - 1 Year | 7% | 7.5% |
| 1 Year - 2 Years | 8% | 8.5% |
| 2 Years - 3 Years | 9% | 9.5% |
| 3 Years - 5 Years | 10% | 10.5% |
| Above 5 Years | 11% | 11.5% |
| Savings Bank A/c | 5% | 5% |
| Recurring Deposit | 6% | 6.5% |

J.B. RAJU, IIS, vrs Ambassador
Dr. B.M. Vinod Kumar IFS Retd
Nerella Koteswara Rao DGM vrs BSNL
Dr. Guduri Seethamaha Lakshmi
M. Padma Sarma D.E. vrs BSNL
G. Kenny Bob
Dr. N. Venkateswarlu Principal Retd, Govt. Dental College
P.M. Raju. Chief Engineer, Retd
A. Punna Rao Chief Manager, Retd, Canara Bank
Arepally Rajendar DGM vrs, NTPC
S. Rama Krishna

Chairman : Dr. K. Siva Bhagya Rao, IRS vrs

CONTACT :
Hyderabad 76600 27682, 7842106355
Visakhapatnam 0891-2791205, 9246663046, 7660027696, 7660027664
Vijayawada 76600 27670, 900062111
Tirupathi 94400 77239
Bapatla 94403 20562
Ponnur 99089 91763
Cherukupalli 79958 56068
Karlapalem 76600 27676

H.No. 6-29/3/12, 3rd Floor, Daulat Plaza, Lakdikapul, Hyderabad - 500 004
E-mail : snehamacsltd@gmail.com

ప్రజాపాలన

సంపాదకీయం

శుక్రవారం 31, డిసెంబరు 2021

# నోరులేనివారిపైనే నల్ల చట్టాలు

దేశంలో ప్రగతిశీల భావజాలం సజీవంగా ఉండాలని, ప్రజాస్వామ్య విలువలు పరఢవిల్లాలని కోరడమే నేరంగా మారింది. నోరులేని వర్గాలను తొక్కడానికే దేశంలో నల్లచట్టాలు సాధనాలుగా మారుతున్నాయి. చట్ట వ్యతిరేక కార్యకలాపాల నిరోధక సవరణ చట్టం-2019 (యూఏపీఏ)ను ప్రధానంగా మైనార్టీలు, ఎస్సీ ఎస్టీల గొంతునొక్కడానికే దేశవ్యాప్తంగా వాడుతున్నారు. 1962లో ఇండో-చైనా యుద్ధం, 1971లో ఇండో-పాక్ యుద్ధం, 1975లో ఎమర్జెన్సీ సందర్భంగా రాజ్యాంగంలోని ఆర్టికల్-352 ప్రకారం పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛను నియంత్రించడానికి 1967లో ఈ చట్టాన్ని తొలుత తెచ్చారు. ప్రధానంగా భావ ప్రకటన స్వేచ్ఛ, సమావేశమయ్యే హక్కు, యూనియన్లు పెట్టుకునే హక్కును నియంత్రిస్తూ 1967లో యూఏపీఏ చట్టాన్ని తెచ్చారు. దేశ సమగ్రతను ప్రశ్నించేవారిపై, దెబ్బతీసేవారిపై చర్యలు తీసుకోవడానికంటూ దీన్ని తెచ్చారు. 2004లో పోటా చట్టాన్ని రద్దు చేసిన కేంద్రం... ఉగ్రవాద కార్యకలాపాల నియంత్రణకు ఒక చట్టం ఉండాలనే కోణంతో 2004లో యూఏపీఏ యాక్ట్‌లో ఉగ్రవాద వ్యతిరేక కార్యకలాపాలను నియంత్రించడానికి ప్రత్యేక క్లాజును జోడించింది. ఈ చట్టానికి 2019లో సవరణ చేయడం ద్వారా మరిన్ని అధికారాలను కేంద్రం కల్పించుకుంది. అంతకుముందు ఏ సంస్థనైనా ఉగ్రవాద సంస్థగా ప్రకటించే అధికారాలు ఉండగా, ఏ వ్యక్తినైనా ఉగ్రవాదిగా ప్రకటించే అధికారం దఖలు పరుచుకుంటూ ఈ చట్ట సవరణ జరిగింది. ఒక వ్యక్తిని 180 రోజులపాటు ఛార్జిషీట్ వేయకుండా జైలులో పెట్టవచ్చు. బెయిల్ పొందే హక్కును రద్దు చేస్తూ, ఏ సంస్థ నేరారోపణ చేసిందో ఆ సంస్థ వద్దే అప్పీల్ చేసుకునేలా దీన్ని తయారుచేశారు. దేశ సమగ్రతను దెబ్బతీసేవారిని కట్టడి చేయడానికి తెచ్చిన ఈ చట్టం దేశ సమగ్రతను బలపరిచేవారిపై వాడేందుకు ఆయుధంగా మారింది. అయితే న్యూఢిల్లీలో అల్లర్లు ఏ సంస్థ చేయించిందో, ఈ అల్లర్లను ప్రేరేపించిన వారెవరో, వాటికి అనుకూలంగా వ్యవహరించిన వారెవరో దేశంలోని ప్రతీ ఒక్కరికీ తెలిసినా- ఈ అల్లర్లకు కారకుడనే కారణంతో 2020 సెప్టెంబరులో యూఏపీఏ చట్టం కింద జేఎన్‌యూ పూర్వ విద్యార్థి ఉమర్ ఖాలేద్‌ను ఢిల్లీ పోలీసులు బంధించారు. వాస్తవానికి ఈ కేసు కూడా కేంద్రంలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ ఐటీ సెల్ ప్రతినిధి సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు కారణంగానే పెట్టారు. ఈ పోస్టులోనే ఉమర్ ఖాలేద్ ఏ నేరం చేయలేదనే అంశంపై స్పష్టత ఉంది. 'అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతదేశానికి వస్తే ఆయనకు ఇక్కడి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వివరిస్తాం. మహాత్మాగాంధీ పాటించిన విలువలను ఏ విధంగా తూట్లు పొడుస్తున్నారన్నది చెబుతాం. దేశ విభజన శక్తులకు వ్యతిరేకంగా దేశ ప్రజానీకం పోరాడుతుందనే సంకేతాలు ఇస్తాం' అని జేఎన్‌యూ పూర్వ విద్యార్థి ఉమర్ ఖాలేద్ ప్రకటించడమే నేరంగా మారింది. ఉమర్ ఖాలేద్‌ను 14 నెలల కిందట అరెస్ట్ చేసి, కనీసం బెయిల్ కూడా రానీయకుండా జైలులో ఖైదు చేశారు. మహాత్ముడి శాంతి సందేశం వివరించడమే ఖాలేద్ నేరంగా మారింది. దేశ ప్రజల్లో విద్వేషాన్ని నూరిపోసేవారికి ప్రభుత్వం వత్తాసు పలుకుతోంది. వారు ఏ సామాజికవర్గం వారైనా కంటికి రెప్పలా కాపాడుకుంటోంది. సమాజంలో పరివర్తన రావాలని కోరుకునే వారిని ఏ చిన్న అవకాశం దొరికినా వదలడం లేదు. దీనికోసం వారు మాట్లాడిన మాటలను మార్ఫింగ్ చేసి, ప్రచారం చేయడానికి వెనుకాడటం లేదు. దేశ విభజన శక్తులకు ఊపిరిపోసే చర్యలకు కారణమైన మనుషులపై కేసులు పెట్టడానికి కఠిన చట్టాలు కానరావని తాజాగా తేటతెల్లం అయింది. నాలుగురోజుల కిందట హరిద్వార్‌లో విద్వేష సమావేశం ఎజెండా దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. మయన్మార్‌లో రోహింగ్యాలను ఏ విధంగా ఊచకోత కోశారో అదే విధంగా దేశంలోని మైనార్టీలను ఊచకోత కోయడానికి సిద్ధం కావాలని ప్రమాణాలు చేసి, చేయించినవారికి వ్యతిరేకంగా ప్రధానమంత్రి కానీ, కేంద్ర హోంమంత్రి కానీ ఒక్కమాట మాట్లాడలేదు. విద్వేష శక్తులు ప్రసంగం చేసి, సమర్థించుకొని, ఆ ప్రసంగాలకు మరింత వివరణ ఇస్తూ స్వేచ్ఛగా తిరుగుతున్నారు. వీరిపై ప్రయోగించడానికి కఠిన చట్టాలేవీ కానరావడం లేదు. ఈ వీడియోలు ప్రపంచవ్యాప్తంగా తిరుగుతున్నాయి. హరిద్వార్ విద్వేష ప్రసంగాలు చేసిన వారి పట్ల అనుసరిస్తున్న విధానాన్ని బట్టి ప్రభుత్వం ఈ దేశానికి ఎలాంటి భవిష్యత్తు ఆశిస్తున్నదో అర్థమవుతోంది. ఈ చట్టాలన్నీ కేవలం పీడిత వర్గాలను అణచివేయడానికేనని తెలుస్తోంది. నల్ల చట్టాల కింద బలవుతున్న వారు మైనార్టీలు, ఎస్సీ, ఎస్టీ, పీడిత వర్గాలే. దేశ జనాభాలో మైనార్టీల జనాభా కేవలం 15 శాతం లోపు మాత్రమే. 85 శాతానికి పైగా ఉన్న మెజార్టీ వర్గాలకు వీరి నుంచే ముప్పు ఉందనే దుష్ప్రచారం విచారకరం. మైనార్టీలు ఏ పని చేసినా నేరంగా, భూతద్దంలో చూసే కోణం పెరిగిపోయింది. కేంద్రంలో అధికారంలో ఉన్నవారి చేతుల్లో ఉన్న ప్రచురణ, ప్రసార మాధ్యమాలు మైనార్టీలను టార్గెట్‌గా చేసుకొని విషం చిమ్ముతున్నాయి. ఇవి పౌర సమాజాన్ని ప్రభుత్వాన్ని సమర్థించేవారు, ప్రభుత్వాన్ని వ్యతిరేకించేవారుగా చీల్చాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచి ఒక్కో ఇటుక పేర్చుతూ నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను, బ్యాంకులను తెగనమ్ముతున్న ప్రభుత్వ వైఖరిని ప్రశ్నించే ప్రయత్నం మాత్రం ఏ మాధ్యమమూ చేయడం లేదు. విద్వేషాన్ని చిమ్ముతూ దేశాన్ని అమ్ముతున్న శక్తులకు వంతపాడుతోంది. గడిచిన రెండు దశాబ్దాల కాలంలో మైనార్టీ వర్గాల్లో గణనీయమైన మార్పులు చోటు చేసుకుంటున్నాయి. విద్య ఒక్కటే సమూల మార్పులకు కారణం కాగలదనే సత్యాన్ని గుర్తిస్తూ ఈ వర్గాలన్నీ బయటికి వస్తున్నాయి. చదువుకోవడం, పోటీ పరీక్షల్లో ఉద్యోగాలు దక్కించుకోవడం వంటి ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇది కూడా నేరంగా చూపించే ప్రయత్నాలు జరగడం విచారకరం. వాస్తవానికి యూపీఏ-1, యూపీఏ-2 విధానాలతో మైనార్టీలు క్రమంగా ప్రధానస్రవంతిలోకి వచ్చి, చదువుకుంటూ విద్యారంగంలో రాణిస్తున్నారు. అయితే మైనార్టీలు మత విద్యను మాత్రమే చదువుకుంటూ అనాగరికంగా, ప్రధాన స్రవంతికి దూరంగా బతకాలనే దృక్పథమే విద్వేష శక్తులకు ఉన్నట్లు పలు పరిణామాలు ఈ మధ్యకాలంలో చాటి చెబుతున్నాయి. ఓ మాధ్యమం అయితే ఏకంగా యూపీఎస్సీ నిర్వహించే పోటీ పరీక్షల్లో ఉద్యోగాలను దక్కించుకుంటున్న మైనార్టీలకు వ్యతిరేకంగా 'యూపీఎస్సీ జిహాద్' అనే కార్యక్రమం నిర్వహించింది. ప్రగతిశీల భావజాలం కూడా నేరంగా మారిపోయింది. దేశ సమగ్రతకు పాటుపడే వారు, కోరుకునేవారికి నల్లచట్టాలు శాపంగా మారిపోయాయి.

# ఉపాధి రహిత వృద్ధి...పని కోసం యువత రద్దీ...




ఉదర పోషణార్థం బహుకృత వేషం అన్నట్లుగా ఉత్తరప్రదేశ్ విధాన సభ ఎన్నికల్లో గెలుపు కోసం బిజెపి నేతలు చేయని శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, చెప్పని మాటలు లేవు. పగలంతా భారీ సంఖ్యలో జనాన్ని సమీకరిస్తున్న సభల్లో మాట్లాడుతూ సాయంత్రానికి కరోనా నిరోధక చర్యల గురించి బోధలు చేస్తున్నారనే విమర్శను ప్రధాని నరేంద్ర మోడీ మూటగట్టుకున్నారు. ప్రయాగసభలో మాట్లాడుతూ ఉత్తరప్రదేశ్‌లో యోగి సర్కార్ సాధించిన విజయాల్లో మహిళా సాధికారత ఒకటని చెప్పారు. అయితే ప్రపంచ బాంకు సమాచారం ప్రకారం 2005లో మన దేశంలో మహిళా కార్మికుల భాగస్వామ్యం 26 శాతంగా ఉంది. 2019 నాటికి అది 20.3 శాతంగా ఉంది. పక్కనే ఉన్న బంగ్లాదేశ్‌లో 30.5, శ్రీలంకలో 33.7 శాతం మంది ఉన్నారు. కరోనా కారణంగా మన దేశంలో 2020 ఏప్రిల్-జూన్‌లో 15.5 శాతానికి తగ్గింది. ఇక యోగి ఆదిత్యనాథ్ ఏలుబడిలో తొమ్మిది శాతం, బీహార్‌లో ఐదు శాతం మాత్రమే అని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. కెనడా లోని ఫ్రాసర్ సంస్థ విడుదల చేసిన ప్రపంచ ఆర్థిక స్వేచ్ఛ సూచికలో 165 దేశాలకు గాను మన దేశం ఇంతకు ముందున్న 103వ స్థానం నుంచి 2021లో 108వ స్థానానికి దిగజారింది. దీనికిగాను పరిగణన లోకి తీసుకొనే అంశాలన్నింటా పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నందున ప్రయివేటు రంగం వృద్ధి చెందటం లేదట. సంస్కరణల గురించి కబుర్లు చెబుతున్నా పరిస్థితి ఇలా ఉంది. కీలకమైన సేవా రంగాలను సరళతరం చేయటాన్ని నిలిపివేసినట్లు నివేదిక అసంతృప్తి వ్యక్తం చేసింది. తక్కువ ధరలకు సరకులను అందచేసేందుకు బహుళజాతి రిటైల్ కంపెనీలను అనుమతించటం లేదన్నది ఒకటి. సోషలిస్టు విధానాలను అనుసరిస్తున్నందున మరింతగా పరిస్థితి దిగజారుతుందని కెనడా సంస్థ చెప్పిందంటే ఇప్పుడున్న వాటి నుంచి కూడా ప్రభుత్వం వెనక్కు తగ్గి మొత్తంగా కార్పొరేట్లకు అప్పగించాలని కోరుతున్నారు. తాజాగా కేంద్ర ప్రభుత్వం 'అక్వీస్' తొలి నివేదిక ప్రకారం 2021 ఏప్రిల్ నుంచి జూన్ వరకు ఉపాధి తొమ్మిది రంగాలలో 3.08 కోట్లకు పెరిగినట్లు పార్లమెంటుకు తెలిపారు. 2013-14లో 2.37 కోట్లతో పోల్చుకుంటే వృద్ధి రేటు 29 శాతం అని చెప్పారు. వాస్తవం ఏమిటి? 2021 అక్టోబరులో కార్మికశక్తి భాగస్వామ్య రేటు 40.41 (ఎల్.పి.ఆర్) శాతం ఉండగా నవంబరు నాటికి 40.15కు పడిపోయింది. కరోనాకు ముందు 43 శాతం ఉంది, రెండు సంవత్సరాలు రెండు తరంగాల కారణంగా కనిష్టంగా 36 శాతానికి పడిపోయి తిరిగి కోలుకున్నప్పటికీ కరోనా ముందు స్థితికి చేరుకోలేదు. ప్రపంచబ్యాంకు, ఐఎల్ఓ గణాంక పద్ధతి ప్రకారం 2020లో ప్రపంచ సగటు ఎల్‌పీఆర్ 58.6 కాగా మనది 46 శాతం మాత్రమే. మనకంటే అధ్వాన్నంగా ఉన్న దేశాలు మరొక 17 మాత్రమే అని ఐఎల్ఓ చెప్పింది. కరోనాకు ముందు దేశం మొత్తం మీద ఉపాధిలో పట్టణ వాటా 32శాతం కాగా 2021 అక్టోబరులో 31.5 శాతం ఉండగా నవంబరులో 31.2 శాతానికి తగ్గింది. గ్రామాలతో పోల్చుకుంటే పట్టణాలలో సంఘటిత రంగం ఉంటుంది కనుక కాస్త మెరుగైన వేతనాలుంటాయి. అవే తగ్గాయంటే దాని ప్రభావం మొత్తం మీద ఉంటుంది. మొత్తంగా నవంబరు నెలలో అదనంగా వచ్చిన ఉపాధి 14 లక్షలు, పట్టణాల్లో 9 లక్షలు తగ్గినా గ్రామాల్లో 23 లక్షలు పెరిగినందున ఈ పెరుగుదల ఉంది. నెలవారీ వేతనాలు పొందే వారి సంఖ్య తగ్గుతుండటం ఆందోళనకరం. 2019 నవంబరులో నెలవారీ వేతన జీవుల సంఖ్యతో పోలిస్తే 2021లో 9.7 శాతం తగ్గారు. ప్రస్తుతం ఒమిక్రాన్ కరోనా వైరస్ తరంగం ప్రపంచాన్ని, మన దేశాన్ని కూడా భయపెడుతున్నది. ఆర్థికంగా కోలుకోవటం కష్టమనే అంచనాలు వెలువడుతున్నాయి. గత మూడు దశాబ్దాల సంస్కరణల ఫలితాలు, పర్యవసానాలను చూస్తే జీడీపీ వృద్ధి కనిపిస్తుంది, జనాభా వృద్ధి రేటు తగ్గుతోంది. కానీ ఉపాధి వృద్ధి రేటు జనాభాకు అనుగుణంగా లేదు. ముఖ్యంగా గత దశాబ్ది కాలంలో ఉపాధి రహిత వృద్ధి ఎక్కువగా కనిపిస్తోంది. వ్యవసాయం గిట్టుబాటు కాని స్థితిలో ఆ రంగంలో యంత్రాల వాడకం గణనీయంగా పెరిగి ఉపాధి తగ్గింది. ఆ మేరకు పట్టణాలలో పెరగలేదు. పెరిగింది కూడా అసంఘటిత రంగంలో ఉంది. ప్రపంచీకరణ కారణంగా ఐటి, అనుబంధ రంగాలలో కొత్త ఉపాధి అవకాశాలు వచ్చినప్పటికీ అవి నైపుణ్యం ఉన్నవారికే పరిమితం అన్నది తెలిసిందే. 2005-10 మధ్య సంఘటిత రంగంలో నిఖరంగా పెరిగిన ఉద్యోగాలు పదిలక్షల మాత్రమే కాగా 60 లక్షల మంది ఉద్యోగార్థులు మార్కెట్లో చేరారు. తామర తంపరగా వెలసిన ప్రయివేటు విద్యా సంస్థల నుంచి ఇంజనీర్లు, ఎంబిఏ, ఎంఎ పట్టాల వారు లక్షల సంఖ్యలో తయారయ్యారు. మన అవసరాలకు మించి వారిని ఉత్పత్తి చేస్తున్నాము. వారిలో కొందరి నైపుణ్యం ప్రశ్నార్థకం, అంతకంటే తక్కువ విద్య, నైపుణ్యం ఉన్నవారికి తగిన ఉపాధి అవకాశాలు పెరగలేదు. ఇతర అనేక దేశాలతో పోల్చితే మన దేశంలో యువజనం ఎక్కువగా ఉన్నమాట నిజం. వీరికి కావాల్సింది ఉపాధి తప్ప మాటలు కాదు. సమగ్రమైన సమాచారం అందుబాటులో లేదు. వివిధ సంస్థల అంచనాల ప్రకారం 2004-12 సంవత్సరాలలో ఏటా 25 లక్షల ఉద్యోగ అవకాశాలు పెరిగితే 2012-16 మధ్య 15లక్షలకు తగ్గాయి. ఏదో ఒక సామాజిక భద్రత ఉన్న రెగ్యులర్ కార్మికులు 2011-16 కాలంలో 45 నుంచి 38శాతానికి తగ్గారు. సంస్కరణల కాలంలో మనకు వచ్చిన విదేశీ పెట్టుబడులు ఎక్కువ భాగం సేవా రంగానికే వచ్చాయి. మిగిలినవి కార్మికులు తక్కువగా ఉండే పరిశ్రమలకు వెళ్లాయి. జిడిపి లో సేవారంగం వాటా గణనీయంగా పెరిగింది కానీ ఆ మేరకు ఉపాధి పెరగలేదు. విధానపరమైన లోపాలు, మన పరిస్థితులకు అనుగుణంగా పథకాలను రూపొందించలేదనే లోపాన్ని అంగీకరించేందుకు ఎవరూ సిద్ధం కావటం లేదు. అధికారంలో ఎవరున్నా బడా పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానాలను అమలు జరిపారు. ఎంత ఎక్కువ పెట్టుబడులు పెడితే అంత ఎక్కువ రాయితీలు, సదుపాయాలు కల్పించారు తప్ప ఎక్కువ మందికి ఉపాధి కల్పించాలనే వైపు దృష్టి పెట్టలేదు. 2017-18లో నాలుగున్నర దశాబ్దాల రికార్డు స్థాయికి 6.1శాతం నిరుద్యోగం పెరిగిందన్న ప్రభుత్వ సర్వే వివరాన్ని 2019 ఎన్నికల ముందు తొక్కిపెట్టారు, అది తప్పుల తడక, ఉపాధి గురించి లెక్కలు సరిగా వేయలేదన్నారు. ఎన్నికలు ముగిశాక గుట్టుచప్పుడు కాకుండా అదే నివేదికను ఆమోదించారు. ఇప్పుడు అంతకంటే ఎక్కువ నిరుద్యోగం ఉంది. 2019-20లో 8.6 కోట్ల మంది నెలసరి వేతన జీవులుండగా 2021 ఆగస్టు నాటికి 6.5 కోట్లకు తగ్గారు. వీరికి అదనంగా నిరుద్యోగులు తోడవుతారు. మనకున్న యువ శ్రమశక్తితో ప్రపంచాన్నే మన చెప్పుచేతల్లోకి తెచ్చుకోగలమని చెప్పేవారున్నారు. అది ఒక కోణంలో చూస్తే నిజమే. చైనా అలాంటి ఫలితాన్ని సాధించింది. మంచి ఉద్దేశ్యాలే కాదు, అందుకు తగిన విధానాలు కూడా ఉండాలి. లేనట్లయితే అదే అవకాశం ప్రతికూలంగా కూడా మారుతుందని కూడా హెచ్చరిస్తున్నారు. ప్రస్తుతం జనాభాలో 54 శాతం మంది పాతికేళ్ల లోపువారే, మరోవిధంగా చూస్తే 62 శాతం మంది 15-59 ఏళ్ల మధ్య ఉంటారు. వీరికి తగిన నైపుణ్యాలను సమకూర్చి ఉపాధి చూపకపోతే పక్కదారులు పట్టే అవకాశం ఉంది. సిఎంఐసి సమాచారం ప్రకారం 2016లో ఉపాధిలో ఉన్నవారి సంఖ్య 40.73 కోట్ల మంది, 2018-19 నాటికి 40.09 కోట్ల మందికి తగ్గారు. ఆర్థిక వ్యవస్థ పెరిగితే ఐదు లక్షల కోట్ల డాలర్ల స్థాయికి జిడిపి ని తీసుకుపోతామని చెప్పినా, నిజంగా తీసుకుపోయినా యువతీ, యువకులకు ఒరిగేదేమిటి? 2030 నాటికి వ్యవసాయ రంగంలో ఉపాధి 44 నుంచి 30 శాతానికి తగ్గుతుందని అంచనా. ప్రస్తుత అంచనా ప్రకారం 2030 నాటికి 14.5 కోట్ల మందికి వ్యవసాయేతర రంగాల్లో పని కల్పించాల్సి ఉంటుంది. వారందరికీ ఉపాధి కల్పించే విధానాలను అవలంభించకపోతే తలెత్తే పర్యవసానాలకు బాధ్యులెవరు? అందుకు గాను ఏటా 8-9శాతం చొప్పున వృద్ధి రేటు ఉండాలి. అదీ ఉపాధి సహితమైనది, అది జరగాలంటే విధానాలను అందుకనుగుణంగా మార్చాలి, అదే ఎలా?

# వినాశకర నిర్ణయాలు



రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు విద్యా రంగానికి వినాశకరంగా మారుతున్నాయి. పేదలకు నాణ్యమైన విద్యను అందించడానికే అని ప్రభుత్వం సమర్థించుకుంటోంది. కానీ, ఆచరణలో ఈ నిర్ణయాలు వారిని బడికి దూరం చేస్తున్నాయి. వికాసానికి అత్యంత కీలకమైన ప్రాథమిక విద్యను సైతం అందకుండా చేస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యా విధానాన్ని అమలు చేయడం, ప్రపంచ బ్యాంకు ఆదేశాలను అమలు చేయడమన్నది ఈ నిర్ణయాల వెనుక ఉన్న చేదు నిజం. దానిలో భాగంగా పాఠశాలల్ని, ఉపాధ్యాయ పోస్టులను తగ్గించడం వంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోంది. ఒక కిలోమీటరు లోపు దూరంలో ప్రాథమిక పాఠశాల ఉండాలన్న విద్యాహక్కు చట్టం లోని నిబంధనను మార్చి 3 కి.మీ లోపు ఉండవచ్చంటూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వులు కూడా ఇటువంటివే! దీంతో పట్టణాల్లో వీధిబడులు, గ్రామాల్లో ఊరిబడులు అదృశ్యమైపోతాయి. రెక్కాడితే గానీ, డొక్కడని నిరుపేదలకు, తరతరాలుగా విద్యకు దూరమైన దళితులకు ఈ పరిస్థితి మరింత క్లిష్టంగా మారుతుంది. తెలుగు మీడియంను రద్దు చేయడంతో విద్యా రంగాన్ని భ్రష్టు పట్టించే చర్యలు ప్రారంభమైనాయి. దశాబ్దాల తరబడి లక్షలాది మందిని విద్యావంతులుగా తీర్చి దిద్దిన ఎయిడెడ్ సంస్థలను ఒక్క కలం పోటుతో రద్దు చేయడానికి ప్రభుత్వం బరితెగించింది. అనూహ్యంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రోడ్ల మీదకు రావడంతో కొన్ని మినహాయింపులతో వెనక్కి తగ్గినట్టు ప్రకటించింది. అయినప్పటికీ, ఆ సంస్థలకు ఊపిరి అందకుండా చేసే అన్ని చర్యలనూ తీసుకుంటోంది. ప్రీ ప్రైమరీని ప్రాథమిక పాఠశాలల్లోకి తీసుకురావాలని నిర్ణయించింది. దీంతో అంగన్‌వాడీల స్వతంత్ర ప్రతిపత్తి దెబ్బ తినడంతో పాటు, మాతా శిశుసంరక్షణకు ఉద్దేశించిన వాటి అసలు లక్ష్యమూ ప్రశ్నార్థకంగా మారుతుంది. ఇది పిల్లలతో పాటు, వారి తల్లులకూ నష్టదాయకంగా మారుతుంది. ఇది చాలదన్నట్లు పాఠశాలల్లో ఒకటి, రెండు తరగతులను మాత్రమే ఉంచి, 3,4,5 తరగతులను హైస్కూళ్లలో కలిపే ప్రక్రియను పెద్ద ఎత్తున ప్రారంభించింది. దీనికి న్యాయపరమైన చిక్కులు రాకూడదన్న ఉద్దేశ్యంతోనే విద్యాహక్కు నిబంధనలను మార్చి మరీ ప్రాథమిక పాఠశాలలు మూడు కి.మీ దూరం ఉండవచ్చంటూ తాజా ఉత్తర్వులు ఇచ్చింది. ఆరు నుండి పది సంవత్సరాల లోపు పిల్లల మానసిక స్థితి, ఎదుగుదల ఒకే రకంగా ఉంటాయని ప్రపంచవ్యాప్తంగా విద్యావేత్తల, మానసిక శాస్త్రవేత్తల నిర్ధారణ. అందుకే, దాదాపుగా అన్ని దేశాల్లోనూ 1-5 తరగతులు ఒకే యూనిట్‌గా ఉన్నాయి. కానీ, రాష్ట్ర ప్రభుత్వానికి మాత్రం ఇవేమి పట్టవు. తాను పట్టిన కుందేలుకు మూడే కాళ్లన్నట్టుగా వ్యవహరిస్తోంది. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన నూతన విద్యావిధానాన్నే తాము అమలు చేస్తున్నామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతుండగా, తమ పాలన లోని రాష్ట్రాల్లో విద్యారంగం వెలిగిపోతోందని విజయవాడలో జరిగిన సభలో బిజెపి అధ్యక్షుడు సోము వీర్రాజు చెప్పడం హాస్యాస్పదం! దేశంలో జరిగిన ఏ ఒక్క అధ్యయనం కూడా బిజెపి పాలిత రాష్ట్రాలు విద్యారంగంలో ముందున్నట్లు చెప్పక పోగా, రోజురోజుకి పతనమవుతున్నాయని ఘోషిస్తున్నాయి. పైగా ఆ రాష్ట్రాల్లో పెద్ద సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు మూతపడుతున్నాయి. ఇక ఆయన తిట్టిపోసిన కమ్యూనిస్టులు, యూనియన్లు బలంగా ఉన్న కేరళ విద్యారంగంలో దేశంలోనే అగ్రస్థానంలో ఉందన్న విషయం అందరికి తెలిసిందే. నూతన విద్యావిధానం అమలుతో పాటు సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (సాల్ట్) పేరిట ప్రపంచబ్యాంకుతో విద్యాభివృద్ధి కోసమంటూ రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాన్ని చేసుకుంది. ఉపాధ్యాయులపై వ్యయం తగ్గించి, సాంకేతిక పరిజ్ఞానంతో పాఠశాలలు నడపాలన్నది బ్యాంకు నిర్దేశం! ప్రభుత్వం తలపెట్టిన సంస్కరణలన్నీ అమలులోకి వస్తే 54,000కు పైగా ఉపాధ్యాయ పోస్టులు అవసరం లేకుండా పోతాయన్నది ఒక అంచనా! మోడీ మెప్పు కోసమో.. ప్రపంచబ్యాంకు రుణం కోసమో రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలు విద్యారంగాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. చిన్నారుల భవిష్యత్తును చిదిమేస్తాయి. అందుకే, ఈ వినాశకర సంస్కరణలను ఎదుర్కొని, విద్యారంగ పరిరక్షణ కోసం ఉద్యమించడం ప్రతి ఒక్కరి బాధ్యత!

# మెగా జాబ్ మేళా



కావలి, డిసెంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి :నియోజకవర్గంలోని బోగోలు మండలం నూతన వద్ద గల ఆర్ ఎస్ ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ జీతం ఎంత అనేది కాకుండా ముందుగా ఉద్యోగం సంపాదించుకోవాలని తెలియజేశారు. తాను ఇంజనీరింగ్ పూర్తి చేసిన తర్వాత 350 రూపాయల కి ఉద్యోగం చేశానని తర్వాత అంచెలంచెలుగా ఎదిగి చాలా మందికి ఉద్యోగ అవకాశాలు ఇచ్చారు అని తెలియజేశారు. ఈ మెగా జాబ్ మేళా కు వచ్చిన నిరుద్యోగులు ఉద్యోగాలు పొందాలని ఆయన కోరారు. ఉద్యోగం చిన్నదైనా పెద్దదైనా ముందు ఉద్యోగాన్ని సంపాదించాలని ఆయన చెప్పారు. మొదటిగా ఇంజనీరుగా 350 రూపాయలతో చేరిన కన్స్ట్రక్షన్ ను మరిచిపోలేనని తెలియజేశారు. మొట్టమొదట ఉద్యోగం ఇచ్చిన వారిని ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరాలు నిరుపేదల పాలిట వరం



నరసాపురం, డిసెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) : నిరుపేదల పాలిట ఉచిత వైద్య శిబిరాలు వరమని శాసనమండలి మాజీ చైర్మన్, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు ఎమ్ఏ షరీఫ్ అన్నారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో స్థానిక తెదేపా కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఎం.ఎ షరీఫ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరైన పోషకాహారం లేమివలన ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. మారుమూల ప్రాంతాలలోని పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలనే సదుద్దేశంతో నరసాపురం అంతర్జాతీయ లేసు ట్రేడ్ సెంటర్, విజన్ స్ప్రింగ్ సంస్థల వారు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని అన్నారు. ఉచిత కంటి వైద్య శిబిరంలో అవసరమైన రోగులకు కళ్ళజోళ్ళు ఉచితంగా అందించేందుకు తెదేపా నాయకుడు కొవ్వలి రామ్మోహన్ నాయుడు ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమని అన్నారు. గతంలో నియోజకవర్గ ప్రజలకు కరోనా నివారణార్థం ఆనందయ్య ఆయుర్వేద మందులను తెదేపా ఇంచార్జి పొత్తూరి రామారాజు పంపిణీ చేసి సేవాభావాన్ని చాటుకున్నారన్నారు. ఈఉచిత నేత్ర వైద్య శిబిరంలో సుమారు 200 మంది రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్ళను అందించారు. ఈకార్యక్రమంలో వైద్యులు డాక్టర్ అవినాష్, డాక్టర్ ప్రజ్వల్, డాక్టర్ అపర్ణ, డాక్టర్ రామసుబ్రహ్మణ్యం, తెదేపా అధ్యక్ష, కార్యదర్శులు జక్కం శ్రీమన్నారాయణ, కొల్లు పెద్దిరాజు, పార్టీ సీనియర్ నేతలు భూపతి నరేష్, తుమ్మలపల్లి లక్ష్మీనారాయణ, సంకు భాస్కరనాయుడు, ముస్కుడి రవి, తిరుమాని శశిదేవి, మౌలాలి ఖాన్, మల్లాడి మూర్తి, కొప్పాడ సత్యనారాయణ, భారతి లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

## ఘన వ్యర్థ నిర్వహణ అవగాహన సదస్సు



బాపట్ల ప్రజాపాలన బ్యూరో : ఘన వ్యర్థాల నిర్వహణ గ్రామ పంచాయతీ విధులలో కీలకమైన అంశమని బాపట్ల మండల అధ్యక్షులు చిన్నపోతుల హరిబాబు అన్నారు. మండల ప్రజా పరిషత్



కార్యాలయంలో ఐటీసీ బంగారు భవిష్యత్తు మరియు సెర్చ్ సంస్థ మండల స్థాయిలో ఏర్పాటు చేసిన ఘన వ్యర్థ నిర్వహణ అవగాహన సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. క్లాప్ మిత్ర ల వేతనాలు సకాలంలో అందిస్తే వారు మరింత మెరుగ్గా పని చేయగలరని ,సర్పంచ్ లు సెక్రెటరీ లు క్లాప్ మిత్ర వేతనం , వారికి అవసరమైన రిక్షాలు, దుస్తులు అందించాలని కోరారు. ఈ సందర్భంగా, మెరుగైన పనితీరు కనబరిచిన సిబ్బందికి ప్రశంసా పత్రాలను బహూకరించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఓ రాధాకృష్ణ, ఈఓ ఆర్ డి అలిషా బాబు,సెర్చ్ సంస్థ ప్రతినిధి కృష్ణ, వివిధ గ్రామాల సర్పంచ్ లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ సెక్రటరీ లు, ఇంజనీరింగ్ సహాయకులు, క్లాప్ మిత్ర లు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు



బాపట్ల ప్రజాపాలన బ్యూరో :ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నూతన సంవత్సర క్యాలెండర్ ను బాపట్ల మండల అధ్యక్షులు చిన్నపోతుల హరిబాబు ఆవిష్కరించారు. ఈ రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఉద్యోగులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాధాకృష్ణ, సివిల్ సప్లైస్ డెప్యూటీ తహశీల్దార్ ఓంకార్, ఈఓ ఆర్డీ అలీషా బాబు, పంచాయతీ సెక్రెటరీ లు ,సచివాలయం సిబ్బంది , కార్యాలయం ఉద్యోగులు పాల్గొన్నారు

# సంక్షేమ హాస్టళ్ల మెస్ ఛార్జీలు పెంచాలి: ఎస్.మల్లి

కావలి డిశంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి :సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు మెస్ ఛార్జీలు పెంచాలి అని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షులు ఎస్. మల్లి డిమాండ్ చేశారు.గురువారం ఆర్డీవో కార్యాలయం నందు విద్యార్థులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డిఓ శీనా నాయక్ వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఖైదీలకు రూ.210 రోజుకు, కళాశాల విద్యార్థులకు రూ.46 రూపాయలు ఇవ్వడం దారుణమని అన్నారు. మన రాష్ట్ర ప్రభుత్వం సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ మరియు హాస్టల్




విద్యార్థులకు 2018వ సంవత్సరంలో మెనూ ప్రకారం కందిపప్పు 60 రూపాయలు. ఇప్పుడు రూ.120రూపాయలు, పెసరపప్పు 130 రూపాయలు, చింతపండు 200 రూపాయలు, గ్యాస్ ధరరూ.500 నుండి వెయ్యి రూపాయలు అయింది అని దళిత గిరిజన విద్యార్థులకు కాలేజి సాంఘిక సంక్షేమ ఇంటర్మీడియట్ నుండి డిగ్రీ వరకు నెలకు 1400 వంతున సంవత్సరానికి 14వేల రూపాయలుఇస్తున్నారు. రోజుకు రూ.46 పడుతోంది. ఆ 46 రూపాయల ద్వారా మూడు పూటల భోజనం రావడం కష్టంగా ఉందని అని ఇప్పటి పరిస్థితుల్లో 46 రూపాయలకు ఒక దోసె రాని పరిస్థితుల్లో ఉంది అని 3 పూటలా భోజనం ఎలా వస్తుంది ? అధిక రేట్లు పెరిగిపోయి వార్డన్లు గంజి పోయడానికి కూడా కష్టంగా ఉంది అని ఈ విధంగా ఉంటే హాస్టల్ విద్యార్థులకు, బడుగు వర్గాల పేద విద్యార్థులకు పౌష్టికాహారం ఎలా అందుతుంది. జగనన్న ప్రభుత్వం వచ్చినప్పటి నుండి పేద, బడుగువర్గాల హాస్టళ్ల విద్యార్థుల గురించి పట్టించుకోవడం లేదు అని ఉన్న హాస్టళ్లను తీసివేస్తున్నారు అని డైట్ ఛార్జీలు ఇప్పటికీ పెంచలేదు అని చిన్న పిల్లలకు కూడా కాస్మొటిక్ ఛార్జీలు ఇవ్వలేదు అన్నారు. ఇంత దారుణమైన పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వం వెంటనే కాలేజీ సంక్షేమ హాస్టళ్ల విద్యార్థులకు రూ.20వేలు ఇవ్వాలని, అందులో నుండి గ్యాస్, బియ్యం,వంట చేసే వర్కర్ల జీతాలు పిల్లల స్కాలర్‌షిప్పుల నుండి ఇవ్వకుండా ప్రభుత్వమే భరించాలని ఎస్ మల్లి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంక్షేమ హాస్టల్ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## 15 వ ఆర్థిక సంఘం మెంబర్ గా ఎన్నికైన వైసిపి కౌన్సిలర్ కోటానాయక్ కు ఘన సన్మానం



చిలకలూరిపేట:రాష్ట్రస్థాయిలో 15వ ఆర్థిక సంఘం మెంబర్ చిలకలూరిపేట కు చెందిన ఎస్టీ కు దక్కటం సంతోషదాయకమైన ఎమ్మెల్యే విడదల రజిని అన్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ అధికారులు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.చిలకలూరిపేట పురపాలక సంఘం తరపున కోటా నాయక్ కు జరుగుతున్న పౌర సన్మానం కార్యక్రమం లో ఎమ్మెల్యే విడదల రజిని ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఆమె మాట్లాడుతూ చిలకలూరిపేట నుండి ఆర్థిక సంఘం మెంబర్ గా ఈ పదవి సీఎం జగన్మోహన్ రెడ్డి కేటాయించడం హర్షణీయమన్నారు. ఓసి కు ఇవ్వవలసిన మెంబర్ ఒక ఎస్ టి ఇవ్వమని ఎమ్మెల్యే విడదల రజిని సీఎంకు అడిగారని.. సీఎం ఈ పదవి ఎస్టీ కు ఇవ్వటం చిలకలూరిపేట నియోజక వర్గాన్ని ఆర్థిక సంఘం నిధులతో అభివృద్ధి చేయటానికి దోహదం అవుతుందని ఎమ్మెల్యే రజని అన్నారు. కోటా నాయక్ కష్టపడి పనిచేసే మనస్తత్వం అని ఆమె అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గం లో ఎస్సీ ఎస్టీ బిసి మైనార్టీలకు ఉన్నత స్థానంలో ఉండేట్లు , కృషి చేస్తున్నట్లు, నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తారని ఎమ్మెల్యే అన్నారు. అనంతరం 15 వ ఆర్థిక సంఘం మెంబర్ కోటా నాయక్ ను ఘనంగా సన్మానించారు. సభకు మున్సిపల్ కమిషనర్ రవీంద్ర అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ యార్డ్ చైర్మన్ మద్దిరాల విశ్వనాథం, వైస్ చైర్మన్ సుబ్రమణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ కొలిశెట్టి శ్రీనివాసరావు, ఓలేటి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు తలహా ఖాన్, సొసైటీ అధ్యక్షుడు బ్రహ్మ స్వాములు, కౌన్సిలర్ మౌలాలి, తదితరులు పాల్గొని మాట్లాడారు..

## సచివాలయ సేవలు అందించడానికి అధికారులంతా కృషిచేయాలి: ఎమ్మెల్యే రామిరెడ్డి



కావలి డిశంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి :కావలి డివిజన్ కు సంబంధించి పట్టణంలోని విట్స్ కాలేజీ లో అన్ని సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ లు మరియు వీఆర్వోలు మరియు మున్సిపల్ ప్రొసిసింగ్ కార్యదర్శులతో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కావలి నియోజకవర్గ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని అన్ని శాఖలు సమన్వయంతో కలిసి పనిచేయాలని కోరినారు మరియు ముఖ్యమంత్రి గారి ఆశయాల సాధన దిశగా సచివాలయ సిబ్బంది పని చేయాలని కోరారు మరియు సచివాలయ ద్వారా ప్రజలకు అందిస్తున్న సర్వీసులు పట్ల సంతృప్తి వ్యక్తం చేసినారు ఈ కార్యక్రమంలో కావలి ఆర్డిఓ సీనా నాయక్ మాట్లాడుతూ ప్రజలకు సచివాలయం ద్వారా అన్ని సేవలు నిర్ణీత గడువు తేదీలోగా అందించాలని కోరినారు ప్రభుత్వం విధించిన గడువు లోపల సేవలు అందించిన అప్పుడే ప్రజలు సంతోషంగా ఉంటారని కాబట్టి సేవల పట్ల నిర్లక్ష్యం వహించే వద్దని కోరారు ఈ సేవలు ఎలా చేయాలి అనే విషయం మీద ఈ శిక్షణా కార్యక్రమాన్ని పూర్తిగా ఉపయోగించుకోవాలని కూడా సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంకటసుబ్బారావు మున్సిపల్ కమిషనర్ శివారెడ్డి మరియు అల్లూరు దగదర్తి బోగోలు కావలి మండలం లకు సంబంధించిన సచివాలయ సిబ్బంది విఆర్వోలు పాల్గొన్నారు.

## సచివాలయాల సిబ్బంది సమయపాలన పాటించాలి

**253వ వార్డు సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



విజయవాడ ప్రజాపాలన ప్రతినిధి : వార్డు సచివాలయాల సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. అజిత్ సింగ్ నగర్ మాకినేని బసవ పున్నయ్య స్టేడియం ప్రాంగణంలోని 253 వ వార్డు సచివాలయాన్ని డిప్యూటీ మేయర్ అవుతు శైలజారెడ్డి, 62వ డివిజన్ కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మితో కలిసి ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయ పరిధిలో ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ఆరా తీశారు. సంక్షేమ పథకాల అమలు శాచ్యురేషన్ పద్ధతిలో జరగాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన సేవలను నిర్ణీత గడువులోగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సంక్షేమ క్యాలెండర్ పై ఎప్పటికప్పుడు లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తూ వారిని చైతన్యపరచాలన్నారు. మరోవైపు అగ్రవర్ణ పేద మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జనవరి 9 న అమలు చేయనున్న ఈబీసీ నేస్తం పథకంపై ఇప్పటినుంచే సచివాలయ సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని మల్లాది విష్ణు అన్నారు. డివిజన్ లోని అగ్రవర్ణ పేదలకు ఈ పథకంపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. అనంతరం స్టేడియం ప్రాంగణంలో స్వచ్ఛ సంకల్ప వాహనాలను ప్రారంభించారు. ప్రభుత్వం తలపెట్టిన స్వచ్ఛ సంకల్పం నూరు శాతం సాఫల్యత ప్రజల భాగస్వామ్యంతోనే సాధ్యమని ఈ సందర్భంగా మల్లాది విష్ణు గారు అన్నారు. కార్యక్రమంలో ఏఎంహెచ్ఓ కోటేశ్వరరావు, నాయకులు అఫ్రోజ్, అలంపూర్ విజయ్, దేవిరెడ్డి రమేష్ రెడ్డి, శర్మ, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## హాయర్ సరికొత్త కన్వెన్షన్ మైక్రోవేవ్ ఒవెన్




విజయవాడ,డిసెంబర్ 30: గృహోపకరణాలు మరియు కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్ తయారీలో ప్రపంచంలోనే అగ్రగామిగా ఉన్న సంస్థ హాయర్ అద్భుతమైన గృహోపకరణం లాంచ్ చేసింది.కాంపాక్ట్ మరియు బహుముఖ డిజైన్తో దీన్ని రూపొందించారు . అద్భుతమైన సాంకేతికత మరియు అద్భుతమైన డిజైన్ల సమ్మేళనం ఈ మైక్రోవేవ్ ఒవెన్. అన్నింటికి మించి ఆధునిక వంటగదికి అద్భుతంగా సరిపోయే విధంగా వస్తుంది. ఈ మైక్రోవేవ్ ఒవెన్తో పనీర్ / నెయ్యి / పెరుగు ఫంక్షన్ మరియు ' తడ్కా ' మరియు కూర వంటి ప్రత్యేకమైన ఆప్షన్స్ ఇందు లో ఉన్నాయి . 99 నిమిషాల వంట టైమర్ మరియు మల్టీ స్టేజ్ వంట ఎంపిక.ఈ సందర్భంగా హాయర్ అప్లయన్సెస్ ఇండియా ప్రెసిడెంట్ ఎరిక్ బ్రగాంజుఉ మాట్లాడుతూ ... హాయర్లో మా వినియోగదారులకు కావాల్సిన మరియు వారికి అవసరమైన ఆవిష్కరణలను ఎప్పటికప్పుడు పరిచయం చేయడం మేము ఎల్లప్పుడూ లక్ష్యంగా పెట్టుకున్నాము . కోవిడ్ మహమ్మారి అనంతర కాలంలో ప్రజలలో ఆరోగ్యకరమైన మరియు ఇంట్లో వండిన ఆహారానికి ప్రాధాన్యత పెరిగింది . అందుకే మా వినియోగదారుల ప్రాధాన్యతలను మరియు భారతీయ అవసరాలకు హైయిర్ ఇన్స్పైయిర్ అనుగుణంగా , మా కొత్త 23 ఎల్ కన్వెన్షన్ మైక్రోవేవ్ వినియోగదారులకు అనేక ఆటో – కుక్ మెనుల నుండి ఎంచుకోవడానికి ఉపయోగపడుతుంది . అంతేకాకుండా ఆరోగ్యకరమైన నూనె లేని వంటని ఎంచుకోవడానికి మరియు పాక ప్రయోగాలలో మునిగిపోయేఅవకాశాన్నిఅందిస్తుంది అని అన్నారు.

## ట్రస్ట్ బోర్డు ఆస్తుల పరిరక్షణకు పాలకవర్గం కృషి చేయాలి

**కాంచనపల్లి కనకాంబ ట్రస్ట్ పాలకవర్గ సభ్యుల ప్రమాణస్వీకార మహోత్సవంలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి : నగరంలోని గవర్నర్ పేటలో కాంచనపల్లి కనకాంబ ట్రస్ట్ నూతన పాలకవర్గం కొలువుదీరడంతో కొత్త శోభ సంతరించుకుంది. ఈ మహోత్సవ వేడుకలలో గౌరవ శాసనసభ్యులు ముఖ్య అతిథిగా పాల్గొని సభ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు. కాంచనపల్లి రామచందర్ రావు చైర్మన్ గా, సామంతకూరు దుర్గారావు, జవ్వాజి రంగారెడ్డి, జొన్నవిత్తుల సీతారామాంజనేయులు శర్మ, శ్రీమతి మీసాల బాలనాగమ్మ సత్యనారాయణ, శ్రీమతి వీరవల్లి వెంకట విజయలక్ష్మి ఆచారి, ఆవుల సునీత ధర్మకర్తలుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకత్వంలో హిందూ ధర్మాన్ని కాపాడుతూ, దేవాలయాల వ్యవస్థను పరిరక్షిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. నూతనంగా కొలువుదీరిన సభ్యులందరు అంకితభావంతో పనిచేసి కాంచనపల్లి కనకాంబ ట్రస్ట్ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేయాలని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలకవర్గంలో అన్ని సామాజిక వర్గాలకు సమ ప్రాధాన్యతనివ్వడం జరిగిందన్నారు. సభ్యులందరూ బాగా పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. పూర్వం పెద్దలు దాన ధర్మాలు చేసేందుకుగానూ ట్రస్ట్ బోర్డులను నియమించేవారని మల్లాది విష్ణు అన్నారు. కానీ గత టీడీపీ హయాంలో నగరంలో ఒక కీలక నాయకురాలి కుటుంబం చేతిలో కాంచనపల్లి కనకాంబ ట్రస్ట్ కి చెందిన ఎకరం భూమి ఆక్రమణకు గురైందని ఆరోపించారు. కనీసం అద్దెలు కూడా చెల్లించకుండా ట్రస్ట్ బోర్డును ఏళ్ల తరబడి ఇబ్బందులకు గురి చేస్తున్నారని మండిపడ్డారు. దీని వల్ల పేదలకు మంచి చేయాలన్న కాంచనపల్లి కనకాంబ గారి లక్ష్యం నెరవేరడం లేదని తెలిపారు. మరోవైపు చీప్ లిక్కర్ ఇచ్చి ప్రజలను సంతోషపెడతానని సోము వీర్రాజు చెప్పడం ఆయన వ్యక్తిత్వానికి నిదర్శనమని మల్లాది విష్ణు విమర్శించారు. ఆయన వ్యాఖ్యలతో రాష్ట్రంలో బీజేపీ పరువు కృష్ణా నదిలో కలిసిందన్నారు. రాష్ట్రానికి హక్కుగా రావలసిన ప్రత్యేక హోదా, విభజన హక్కుల గూర్చి మాట్లాడకుండా రూ.50 కే చీప్ లిక్కర్ ఇస్తామంటూ సోము వీర్రాజు రాష్ట్ర ప్రజలను అవమానించారని మండిపడ్డారు. కార్యక్రమంలో వైసీపీ కార్పొరేటర్లు బాలి గోవింద్, కొంగితల లక్ష్మీపతి, జానారెడ్డి, ఉమ్మడి రమాదేవి, అలంపూరు విజయలక్ష్మి, కొండాయిగుంట మల్లేశ్వరి, బంకా శకుంతల దేవి, నాయకులు గుండె సుందర్ పాల్, అలంపూర్ విజయ్, యరగొర్ల శ్రీరాములు, కుక్కల రమేష్, మానం వెంకటేశ్వరరావు, వెన్నం రత్నారావు, కాళ్ళ ఆదినారాయణ, ఈవో సీతారామయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ కార్పొరేటర్లు, నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## అర్హత ఉన్న హౌసింగ్ పెండింగ్ బిల్లులు చెల్లిస్తాం: ఎమ్మెల్యే ముదునూరి



మొగల్తూరు, డిసెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) : మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామంలో బుధవారం రాత్రి పల్లెనిద్ర అనంతరం గురువారం ఉదయం వేకువజామున శాసనసభ్యులు ముదునూరి ప్రసాదరాజు గ్రామంలో పర్యటించారు. ప్రజల సమస్యలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఆయా సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అర్హత ఉండి పెండింగులోఉన్న ప్రతి బిల్లును చెల్లించాలని అధికారులను శాసనసభ్యులు ఆదేశించారు. అర్హత ఉన్నవారికి ఇల్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని పేరుపాలెం సౌత్ గ్రామంలో బరియల్ గ్రౌండ్ నిర్మాణాలకు కావాల్సిన స్థలాన్ని గుర్తించి పరిశీలించాలని ఎమ్మార్వోను ఆదేశించారు. ఇటీవల కాలంలో అనారోగ్యంతో మరణించిన గ్రామానికి చెందిన గుబ్బల పద్మావతి, శంకరపు వీర్లవెంకయ్య, అందే వెంకట్రావు కుటుంబ సభ్యులను శాసనసభ్యులు పరామర్శించారు. గ్రామంలోని నూతన సచివాలయ భవనంచుట్టూ ప్రహరీగోడ నిర్మాణానికి కావలసిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామ కమిటీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పోతుల రమేష్ ,యూత్ కమిటీ అధ్యక్షులుగా నియమితులైన కారాని కిశోర్, మరియు కమిటీ సభ్యులను అభినందించారు పార్టీ బలోపేతానికి కృషిచేయాలని శాసనసభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి తిరుమాని బాబ్జి, ఎంపీపీ అందే సత్యవతి భుజంగరావు, కర్రి ఏసుబాబు, పోతుల రమేష్, మేళం శ్రీనివాస్, ఓసూరి విజయబాబు, కారుమంచి కృపాల్, తిరుమాని విజయలక్ష్మి, కారాని కిషోర్, కొప్పాడి నాగరాజు, కోడెల్ల వెంకటరావు, దొంగ కృష్ణ, పత్తి రాంబాబు, పుతినేని సాయి,%అ%మేళం బన్ను, కొండేటి శామ్యూల్ రాజు, తిరుమాని విజయుడు,%అ%సంకరపు శ్రీనుతదితరులు పాల్గొన్నారు.

# ఆంధ్రప్రదేశ్ మిర్చి రైతులను ఆదుకోండి

- తామర పురుగు తెగుళ్లతో అత్యధికంగా దెబ్బతిన్న పంట
- మిర్చి సాగులో అగ్రగామిగా గుంటూరు జిల్లా.. మా రైతన్నకు అండగా నిలవండి
- మిరప పంట రైతులకు కేంద్ర ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలి
- పంటను కాపాడేందుకు తక్షణమే కేంద్ర నిపుణుల బృందాలను పంట పొలాలకు పంపాలి
- పాడైపోయిన మిరప పంటను కేంద్ర ప్రభుత్వమే కొనాలి
- ఫసల్ బీమా యోజన కింద పంట నష్టపోయిన రైతులందరికీ భీమా వచ్చేలా కృషి చేయాలి
- కేంద్ర మంత్రి కి నరసరావుపేట ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు విజ్ఞప్తి





గుంటూరు. ప్రజాపాలన : ఇటీవల ఆంధ్రప్రదేశ్ లో మిర్చి పంటపై తామర పురుగు తెగుళ్ల ప్రభావం వల్ల మిర్చి పంట తీవ్రంగా నాశనం అయ్యిందని, నష్టపోయిన రైతులను ఆదుకోవాలని, రైతన్నకు అత్యవసర సహాయాన్ని అందించాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి నరేంద్ర సింగ్ తోమార్‌ను ఢిల్లీలో కలిసి అభ్యర్థించారు. ఆంధ్రప్రదేశ్లో మిర్చి పంటపై నల్ల తామర పురుగు వినాశకరమైన దాడిని మంత్రి దృష్టికి తీసుకెళ్లి, మిర్చి రైతులకు, వ్యాపారులకు ఉపశమనం కలిగించడానికి కేంద్రం అత్యవసర చర్యలు చేపట్టాలని వినతిని అందించారు. దేశంలో గుంటూరు జిల్లా మిరప సాగులో ప్రధాన పాత్ర పోషిస్తుందని, దేశంలోని మిరప సాగులో 25% పెరుగుతూ, గుంటూరు మిర్చి మొత్తం రూ.5000 కోట్లకు పైగా టర్నోవర్‌తో 40కి పైగా దేశాలకు ఎగుమతి చేయబడుతుందన్నారు. ఈ సీజన్‌లో రికార్డు స్థాయిలో 1.4 లక్షల హెక్టార్లు విస్తీర్ణంలో సాగు జరిగిందని, అయితే ఈ సీజన్‌లో తెగుళ్ల బెడద, అకాల వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారని, కేంద్రం ఆదుకోవాలని విన్నవించారు. గుంటూరు జిల్లాలో తామర పురుగు తో నాశనం అవుతున్న మిరప పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల రెండు తుఫానులతో విస్తృతంగా పంట నష్టం జరిగిందని అన్నారు. 14,000 హెక్టార్ల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఉన్న పంటపై నల్ల తామర తెగులు ప్రభావం ఉందని, సుమారు రూ.500 కోట్ల నష్టం వచ్చినట్లు అంచనాగా ఉందన్నారు. కేంద్రం అత్యవసరంగా కొన్ని చర్యలు తీసుకోవాలని మంత్రిని అభ్యర్థించారు. .ఈ సీజన్‌లో నల్ల తామర పురుగు వల్ల కల్గిన తెగుల్లతో దిగుబడి కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించండి. పురుగుల దాడులు ఎందుకు జరుగుతున్నాయో అంచనా వేయడానికి, నివారణ చర్యల గురించి రైతులకు మార్గనిర్దేశం చేయడానికి వ్యవసాయం, రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ నుండి నిపుణుల బృందాన్ని పంపండి. నల్ల తామర పురుగులు ప్రభావం తగ్గించడానికి అవసరమైన పురుగుమందులను ఏపీ ప్రభుత్వానికి సహాయం చేయండి. గుంటూరు జిల్లాలో పీఎం ఫసల్ భీమా యోజన యొక్క సార్వత్రిక కవరేజీని ముందస్తుగా నిర్ధారించండి, తద్వారా రైతులందరికీ పంట నష్టం జరిగినప్పుడు బీమా ఉంటుంది.. నేషనల్ అగ్రికల్చర్ కో ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా నష్టపోయిన పంటను సేకరించండి.

# నీకు దమ్ముంటే తక్షణమే తేల్చుకుందాం రా!

## నరసరావు పేట వైసీపీ నాయకుడు: పిల్లి ఓబుల్ రెడ్డి



నరసరావుపేట. ప్రజాపాలన :కాయలున్న చెట్టుకే రాళ్ళు పడతాయన్న సామెత చందంగా శాసనసభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న విమర్శలు సహజమేనని గత రెండున్నర సంవత్సరాలుగా డయల్ యువర్ ఎమ్మెల్యే మరియు గుడ్మార్నింగ్ నరసరావుపేట పేరుతో అను నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలను తీరుస్తున్న ఎమ్మెల్యేపై ప్రతిపక్షాలు విమర్శలు చేయడం బాధాకరమని, గత టిడిపి చరిత్రను చూస్తే ప్రతి చిన్న వ్యాపారస్తులు దగ్గర నుంచి పెద్ద వ్యాపారస్తుల దాకా ఏ విధంగా దందాలు చేశారో నరసరావుపేట ప్రజలందరికీ తెలుసని ,ప్రస్తుతం ఏ చిన్న కష్టం వచ్చినా నేనున్నాను అంటూ ముందుకు వచ్చి తక్షణమే వారి సమస్యలు పరిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గరికి ప్రజలందరూ వచ్చి తమ సమస్యలను పరిష్కరించుకోవడం చూసి ప్రతిపక్ష నాయకులు జీర్ణించుకోలేక పోతున్నారని ,గతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలంటే తెలుగుదేశం నాయకులకు కప్పం కట్టాల్సి వచ్చేదని ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని అంతేకాకుండా గతంలో శాసనసభ్యుల వారి హాస్పిటల్ ఆరోగ్యశ్రీ నుంచి తొలగించిన ఘనత మీది కాదా? అని ,చదలవాడ అరవింద్ బాబు ఆసుపత్రికి ఇప్పటికీ ఆరోగ్యశ్రీ కొనసాగుతూనే ఉందని ఏ రోజు ఎటువంటి కక్షసాధింపు చర్యలకు పాల్పడలేదు అని అటువంటి మంచి వ్యక్తిత్వం గల గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ని విమర్శించడం తగదని జగనన్న కాలనీల పేరుతో 15 వేల కుటుంబాలకు నియోజకవర్గంలో ఇళ్ల స్థలాలు ఇస్తే కోర్టుకెళ్లి అడ్డుకున్న దుర్మార్గులు మీరు అని మీకు గోపి రెడ్డి ని విమర్శించే స్థాయి ఎక్కడుందని ఇంతకంటే సిగ్గుమాలిన పని ఇంకొకటి లేదని తీవ్రంగా విమర్శించారు కేవలం సీటు కోసం పోరాటం లో భాగం గానే గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పై చదలవాడ విమర్శలు చేస్తున్నారని ,మీకు దమ్ముంటే మున్సిపల్ ఎన్నికలను అడ్డుకుంటూ కోర్టులో వేసిన పిటిషన్లను తక్షణమే విత్ డ్రా చేసుకుని ఎన్నికలకు రండి !ఎవరి సత్తా ఏమిటో ప్రజా క్షేత్రంలో తేల్చుకుందాం! అని అని నరసరావుపేట వైసిపి నాయకులు పిల్లి ఓబుల్ రెడ్డి అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర షేక్ కార్పొరేషన్ చైర్మన్ భర్త ఖాజావలి మాస్టర్ మాట్లాడుతూ 3 సంవత్సరాల క్రితం ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా అంజుమన్ షాపింగ్ కాంప్లెక్స్ కు సంబంధించిన 72 షాపులు కూల్చివేసి ఆ కుటుంబాలకు అన్యాయం చేశారని, ఎన్నికల్లో షాపులనిర్మాణంతోపాటు ,మసీదు కూడా కట్టిస్తానని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వాగ్దానం చేశారని చేసిన వాగ్దానం మేరకు మసీదు నిర్మాణం ప్రారంభించారని 2 మాసాల్లో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం కూడా ప్రారంభిస్తారని ,నాయకుడు అంటే నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని, అప్పుడే ప్రజలు ఆదరిస్తారని, అంతేకాకుండా ఆటోనగర్ నిర్మాణానికి కూడా త్వరలోనే అన్ని అనుమతులు తీసుకొని ప్రారంభిస్తారని ,అంతే కాకుండా కరోనా మహమ్మారి సమయంలో అందరికీ వైద్య సేవలు అందేలా జిల్లా వైద్యశాల అందుబాటులోకి తెచ్చి అందరికీ వైద్యం అందేలా చేసి వేలాది మంది ప్రాణాలు కాపాడిన వ్యక్తి ఎమ్మెల్యే ని, నిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటు పడే ఎమ్మెల్యే గారి పై ప్రతిపక్షాలు ఏమి చెప్పినా ప్రజలు నమ్మే స్థితిలో లేరని తెలియజేశారు. నరసరావుపేట ఎస్సీ నాయకులు కందుల ఎజ్రా మాట్లాడుతూ అను నిత్యం ప్రజలతో మమేకమై ప్రజా సమస్యలు తీరుస్తారు కాబట్టే గోపి రెడ్డి 32 వేల మెజార్టీ నరసరావుపేట ప్రజలు ఇచ్చారని ,గత 20 సంవత్సరాలుగా మంచినీటి వసతి లేని శివారు ప్రాంతాలకు సైతం మంచినీటి వసతి కల్పించిన ఘనత గోపి రెడ్డి కి దక్కుతుందని గోపి రెడ్డి పై చదలవాడ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఎస్సీ సెల్ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నాను అని తెలిపారు మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ ఖాదర్ భాష మాట్లాడుతూ మీ నాయకుడికి చిత్తశుద్ధి ఉంటే మీ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే మున్సిపాలిటీ పై వేసిన కోర్టులో కేసు వెనక్కి తీసుకొని తక్షణమే మున్సిపల్ ఎలక్షన్ కి రావాలని తద్వారా ప్రజలు ఇచ్చే తీర్పులో నే మీకు అర్థం అవుతుంది అని తెలిపారు.

# బీజేపీ నేత సోము వీర్రాజు పేరుని తీసివేసి.. సారాయి రాజు గా మార్చుకుంటే బాగుంటుంది

## ఆంధ్రప్రదేశ్ మహిళ సమాఖ్య నాయకులు



చిలకలూరిపేట:అధికారం చేచిక్కించు కోవడం కోసం ఎటువంటి దిగజారుడు తనానికైన తాము సిద్ధమే అన్నట్లు ప్రజాగ్రహసభ లో సోమువీర్రాజు మాట్లాడిన తీరు నిజానికి నిలువుటద్దం గా ఉందని,తమకు అధికారం ఇస్తే 70 రు మద్యం అమ్ముతామని,రెవిన్యూ బాగుంటే 50 రు లకి తగ్గిస్తామని చెప్పడం వీరి దిగజారుడు తనానికి నిదర్శనమని ఆంధ్ర ప్రదేశ్ మహిళా సమాఖ్య నాయకులు విమర్శించారు.. ఈ మేరకు సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ, బీజేపీ ప్రజాగ్రహ సభలో దేశంలో రాష్ట్రం లోని ప్రజలు ఏ ఏ సమస్యలు ఎదుర్కొంటున్నారు? ప్రజల అవసరాలు ఏమిటి? ..తీసుకోవాల్సిన చర్యలు ఏమిటి అనేది చర్చించకుండా ఎంత సేపు తమ సొంత డబ్బా కొట్టుకోవడం ఇతరుల మీద విరుచుకు పడటం తప్ప ప్రజలకు ఉపయుక్తంగా ఒక్క మాటైనా మాట్లాడారా అని వారు ప్రశ్నించారు.. ప్రజారోగ్యం మీద ప్రజా సంక్షేమం మీద ముఖ్యంగా మహిళల రక్షణ మీద భద్రత మీద దృష్టి లోపించిందని,అందుకే తాము అధికారం లోకి వస్తే మద్యం 50రు.లు అమ్ముతాము. ఓట్లేసిగెలిపించండి అనడం వారి కుసంస్కారాన్ని తెలియ చేస్తున్నదని అన్నారు.. రాష్ట్రం నూటికి 70శాతం కుటుంబాలు తాగుడు మహమ్మారి కోరల్లో చిక్కుకుని, అనేక రకాల ఇబ్బందులు పడుతుంటే మీకు పట్టదా..తాగుడు వలన ఇంటా బైట మహిళలు శారీరక మానసిక ,ఆర్థిక ఇబ్బందికి గురౌతున్నా,చిన్న వయసులోనే విధవులుగా మారుతున్నా, సమాజంలో నేర ప్రవృత్తికి ప్రధానంగా వున్న మద్యం వద్దు అనే మహిళలు గోడు పెడుతున్నా మీచెవికి చోకలేదా .అన్నారు.. ఒకవైపు మహిళలు సంపూర్ణ మధ్య నిషేదం కోసం పోరాడుతుంటే మీరు మద్యం రెట్లు తగ్గించి మందు బాబులకు రాయితీలు ఇచ్చి అధికారం లోకి వచ్చి మద్యం రాజ్యాన్ని నిర్మిస్తారా అని ఆక్రోశం వ్యక్తం చేశారు...నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశానికి చేరుతున్నా, పెట్రోల్ డీజిల్ వంటగ్యాస్ ధరలు రోజురోజుకు ఆకాశాన్ని తాకుతున్నా మీకు పట్టలేదు.కానీ మద్యం ధర మాత్రం తగ్గిస్తారు..ఎం నీతి అండి మీది..మీకు నిజంగా అధికారం లోకి రావాలని వుంటే అధికధరలకు కళ్లెం వేయండి..అన్ని నిత్యావసర వస్తువులు సామాన్యుడికి అందుబాటులోకి తెండి.. ప్రజాపంపిణీ వ్యవస్థను పటిష్ట పరచండి.. మహిళల సంక్షేమం కోసం కట్టుబడి వుండండి.. అంతే కాని ఇటువంటి దగుల్బాజీ హామీలతో సారాయి రాజు గా నామ కరణం పొందడానికి ప్రయత్నిం చకండి.. ఇష్టం వచ్చినట్లు మాట్లాడి తే ప్రజలే మీకు తగిన గుణపాఠం చెబుతారని మర్చిపోకండిఅని హెచ్చరించారు.. ఈకార్యక్రమంలో మహిళ సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు నాగభైరు రామ సుబ్బాయమ్మ, ఏరియా కార్యదర్శి చేరుకుపల్లి నిర్మల, సుబ్బాయమ్మ, భారతి, వెంకతెశరమ్మ,పొలమ్మ తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కార్యక్రమం

నరసాపురం, డిసెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) : పట్టణంలోని ఒకటవ వార్డు శ్రీహరిపేటలో గురువారం శానిటేషన్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ జయరాజు, 1వ వార్డు కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవాని భరత్ పాల్గొని ప్రజలకు డస్ట్ బిన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ శ్రీవెంకటరమణ మాట్లాడుతూ నరసాపురం పట్టణాన్ని క్లీన్ పట్టణంగా రూపొందించేందుకు ప్రతి పౌరుడు పారిశుధ్య సిబ్బందికి తమవంతు సహకారాన్ని అందించాలని కోరారు. రోడ్లపైన, డ్రెయిన్లలో చెత్త వేయకుండా డస్ట్ బిన్లలో తడి, పొడి, మరియు ప్రమాదకర వ్యర్థాలను వేరువేరుగా అందివ్వాలని ప్రజలకు సూచించారు. పారిశుధ్య సిబ్బంది అందరూ అంకితభావంతో పనిచేయాలని దీనిలో భాగంగా ప్రతి ఇంటివద్ద తప్పనిసరిగా 3 డస్ట్ బిన్ల విధానంలో తడి చెత్త, పొడి చెత్త, మరియు ప్రమాదకర చెత్త వేరువేరుగా సేకరించేఅంశంపై ప్రజలలో చైతన్యం తీసుకొచ్చే విధంగా ప్రజలందరికీ 3 డస్ట్ బిన్ల విధానంపై అవగాహన కల్పించాలని పారిశుధ్య సిబ్బందికి సూచించారు.

## అత్యంత ఘనంగా లక్షతులసి దళార్చన





చీరాల(ఒంగోలు) : చీరాల ఎం.జి.హెచ్.కాలనీ రామమందిరంలో, గోదా రంగనాథ స్వాముల వారికి, లక్ష తులసీదళ అర్చన అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తవ్వా గీత, ప్రత్తి లక్ష్మి, అన్నపూర్ణ, విజయ, వలివేటి రాము, దేవకి సుబ్బారావుల, సంయుక్త ఆధ్వర్యంలో, గోదా రంగనాథ స్వామి వారికి, లక్ష తులసి దళాలతో, అర్చక స్వాముల వేదమంత్రోచ్చారణల నడుమ, కన్నుల పండువగా అర్చన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు, ప్రత్యేక అలంకరణ చేసి, భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.ప్రత్యేకించి పెద్దసంఖ్యలో మహిళా భక్తులు పాల్గొనడం విశేషం.

## నూతన సంవత్సర క్యాలెండర్ను ఆవిష్కరించిన ఆమంచి స్వాములు



వేటపాలెం(ఒంగోలు) :కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, 2022 నూతన సంవత్సర క్యాలెండర్ను, కాపునాడు జిల్లా కన్వీనర్ ఆమంచి శ్రీనివాసరావు(స్వాములు) ఆవిష్కరించారు. వేటపాలెంలో జరిగిన ఈ కార్యక్రమంలో, కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు తన వంతు సహకారం, ఎల్లవేళలా ఉంటుందని,ఈ సందర్భంగా ఆమంచి.స్వాములు అసోసియేషన్ ప్రతినిధులకు భరోసా ఇచ్చారు. తొలుత కాపు టీచర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఆమంచి స్వాములును మర్యాదపూర్వకంగా సన్మానించారు.

## సీతారామయ్య మృతి తెలుగుదేశం పార్టీకి తీరని లోటు



పర్చూరు(ఒంగోలు) : తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సీతారామయ్య మృతి, తెలుగుదేశం పార్టీకి తీరని లోటని, నిబద్ధత కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమని,తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు,ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు.పర్చూరు నియోజకవర్గం, చిన్ననందిపాడు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, ఆడగాడా సీతారామయ్య మృతి పట్ల, తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు, ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సంతాపం తెలిపారు.ఆయన మరణం పట్ల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి, సంతాపం తెలిపారు.ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని దేవుని ప్రార్థించారు.పార్టీ మంచి నాయకుడిని కోల్పోయిందని,తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం, సీతారామయ్య విశేష కృషి చేశారని, ఎమ్మెల్యే ఏలూరి అన్నారు.

## గుడివాడ డివిజన్ వీఆర్ఓల నూతన కర్యవర్గం ఎన్నిక



గుడివాడ : గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోన ఆంజనేయ కుమార్ ఆధ్వర్యంలో గుడివాడ డివిజన్ వీఆర్వోల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం రాత్రి గుడివాడ ఎన్జీవోస్ హూమ్‌లో గుడివాడ డివిజనన్ తొమ్మిది మండల అధ్యక్ష కార్యదర్శులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాట్ల అజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షులుగా గూడపాటి లక్ష్మణరావు, జనరల్ సెక్రెటరీగా రేగేశ్వరరావు, కోశాధికారిగా లంకపల్లి మీనా, ఉపాధ్యక్షులుగా లక్కప్రగాఢ శ్రీనివాసరావు, కలపాల తేరేజమ్మ, భరత్, కార్యవర్గ సభ్యులుగా పలువురుని ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గాన్ని గుడివాడ డివిజినల్ అధికారి శ్రీనుకుమార్, గుడివాడ తాసిల్దారు మాదాసు శ్రీనివాసరావులు అభినందించారు.

## పీఆర్సీపై తేలని పంచాయితీ

(మొదటి పేజీ తరువాయి)

ఉద్యోగుల కోసం 32శాతం ఖర్చు పెడుతూ.. రాష్ట్ర బడ్జెట్ మొత్తం ఖర్చు చేస్తున్నామని చెప్పడం సత్యదూరం. చర్చలకు ఎందుకు పిలిచారని అడిగితే .. ఫిట్‌మెంట్ గురించి మాట్లాడటానికని చెప్పారు. ఫిట్‌మెంట్ ఎంత ఇస్తారంటే మళ్లీ మొదటికొచ్చారు. జీపీఎఫ్ సొమ్ము రూ.2,100 కోట్లు పక్కదారి పట్టించారు. ఇప్పటి వరకు 7 డీఏలు చెల్లించలేదు. డీఏ బకాయిలు రూ.6వేల కోట్లు ఇవ్వాలి. పీఆర్సీతో పాటు సీపీఎస్ రద్దు, ఒప్పంద సిబ్బంది క్రమబద్ధీకరణపై నిర్ణయం వెల్లడించాలి. ప్రభుత్వ కార్యాచరణ ఇలానే ఉంటే తదుపరి కార్యాచరణకు వెళ్లక తప్పదు. సీఎం వద్దకు వారం రోజుల్లో తీసుకెళ్తామని ఇప్పటి వరకు పట్టించుకోలేదు. గతంలోనే ఎక్కువ జీతం తీసుకున్నారు.. దానికి తగ్గకుండా ఇస్తామని చెబుతున్నారు. ఇది అన్యాయం" అని బొప్పరాజు వెంకటేశ్వర్లు ఆగ్రహం వక్తం చేశారు.

## 8 రాష్ట్రాలకు కేంద్రం లేఖ

(మొదటి పేజీ తరువాయి)

ఇది కాస్త.. 1.10 శాతానికి చేరిందని కేంద్రం తెలిపింది. గత 87 రోజులలో 2 శాతం కంటే తక్కువగా ఉన్నట్లు కేంద్రం తెలిపింది. ఈ మేరకు ఆరోగ్య మంత్రిత్వ శాఖ కార్యదర్శి లవ్ అగర్వాల్ మీడియాతో మాట్లాడారు. 33 రోజుల తర్వాత కేసుల సంఖ్య పెరిగినట్లు వెల్లడించారు. గత నాలుగు రోజుల నుంచి కేసులు విపరీతంగా పెరుగున్న నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అయితే.. దేశంలోని 8 జిల్లాల్లో పాజిటివిటీ రేటు పదిశాతం పైన ఉందని.. 14 జిల్లాల్లో కేసుల సంఖ్య 5 నుంచి 10శాతానికి పెరిగిందన్నారు. ప్రజలంతా మార్గదర్శకాలను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. ఇదిలాఉంటే.. ఢిల్లీలో అత్యధిక సంఖ్యలో ఓమిక్రాన్ వేరియంట్ కేసులు నమోదయ్యాయి. రాజధాని ఢిల్లీలో అత్యధికంగా 263 ఓమిక్రాన్ కేసులు ఉండగా.. మహారాష్ట్రలో 252, గుజరాత్‌లో 97, రాజస్థాన్‌లో 69, కేరళలో 65, తెలంగాణలో 62 కేసులు నమోదయ్యాయి.

## కోస్టల్ బ్యాంక్ వారి సౌజన్యంతో మాస్క్, శానిటైజర్లు అందజేత




గన్నవరం ప్రజా పాలన ప్రతినిధి డిసెంబర్ 30:గన్నవరంలోని జెడ్పీ.హెచ్.స్కూల్ క్రీడా మైదానంలో నేడు అనగా గురువారం ఉదయం కోస్టల్ బ్యాంక్ వారు సౌజన్యంతో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవరపల్లి విక్టర్ బాబు అధ్యక్షతన వాకర్స్ సీనియర్ సిటిజన్స్ మరియు ఇతర వాకర్స్ సభ్యులు సుమారు 70 మంది కి మాస్కులు,శానిటైజర్ తదితర వస్తువులను బ్యాంక్ మేనేజర్ డి.వర ప్రసాద్ చేతులు మీదుగా పంపిణీ చేయడం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ డి.వరప్రసాద్ మాట్లాడుతూ కోస్టల్ బ్యాంక్ తమ ఖాతాదారులకు అందించే సేవలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సెక్రెటరీ చిల్లపల్లి శ్రీనివాసరావు, ట్రెసరర్ చిప్పడా చంద్రశేఖర్ రావు, వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక సభ్యులు టి.యస్.అర్.కే.ప్రసాద్, ముక్కామల సుబ్బారావు,వాకర్స్ డిప్యూటీ గవర్నర్ కే.యన్.బాబూరావు, రోటరీ క్లబ్ సభ్యులు చిమాట రామారావు, వాకర్స్ ఉపాధ్యక్షుడు సగ్గుర్తు శ్రీనివాసా రావు,వీనస్ బాలకృష్ణ,పాస్ట్ ట్రేజరర్ డి.నాగేశ్వరావు,సుబ్బారావు,బ్యాంక్ సిబ్బంది తదితర వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

# వాణిజ్య పరంగా వెనుకబడిన ఇస్రో

(మొదటి పేజీ తరువాయి)

తూత్తుకుడి జిల్లా కులశేఖర్‌పట్నం వద్ద మరో ప్రయోగ వేదికను నిర్మిస్తున్నారు. పీఎస్ఎల్వీ, ఎస్ఎస్ఎల్వీ ప్రయోగాలన్నింటిని కులశేఖర్‌పట్నం నుంచి చేసి భారీ ప్రయోగాలను శ్రీహరికోట నుంచి చేయాలని సంకల్పించారు.

భారీ లక్ష్యాలకు కరోనా షాక్

2020లో సుమారు 12 ప్రయోగాలు, 2021లో 16 ప్రయోగాలు చేయాలని ముందస్తు ప్రణాళికలు ఏర్పాటు చేసుకున్నప్పటికీ ఇస్రోకు కరోనా షాక్ ఇచ్చిందనే చెప్పాలి. 2020 మార్చి 22న జనతా కర్ఫ్యూ, సంపూర్ణ లాక్‌డౌన్‌తో ఆ ఏడాది మొత్తానికి రెండు ప్రయోగాలకే పరిమితమైంది. 2021 సంవత్సరాన్ని 'స్పేస్ రీఫార్మ్ ఇయర్'గా ఇస్రో నిర్ణయించింది. ఈ ఏడాదిలో 16 ప్రయోగాలు చేయాలనే లక్ష్యంగా పెట్టుకున్న సమయంలో కరోనా రెండో విడత విరుచుకుపడి ఎంతో మందిని షార్ ఉద్యోగులను బలిగొంది. లాక్‌డౌన్ సమయంలో షార్ కేంద్రంలోనే కాకుండా దేశంలోని అన్ని ఇస్రో సెంటర్లలో కరోనా మహమ్మారి విజృంభించడంతో అందరూ భయభ్రాంతులకు గురయ్యారు. కరోనా ప్రభావాన్ని ఎదుర్కొంటూనే ఇస్రో కేంద్రాల డైరెక్టర్లు వెబినార్ సిస్టం ద్వారా ఒకరి పరిస్థితులు ఒకరు తెలుసుకుంటూ రాకెట్ ప్రయోగానికి మళ్లీ పూనుకున్నారు. భౌతికదూరాన్ని పాటిస్తూ, శానిటైజర్లు వాడుకుంటూ గతేడాదిన రెండు ప్రయోగాలు, ఈ ఏడాది రెండు ప్రయోగాలు మాత్రమే చేయగలిగారు. ఈ ఏడాది నిర్వహించిన రెండు ప్రయోగాల్లో దురదృష్టవశాత్తూ ఒక్క ప్రయోగం విఫలమైంది.

వెంటాడుతున్న ఒమిక్రాన్

తాజాగా ప్రయోగాలకు సిద్ధమవ్వాలనుకునే సమయంలో ఒమిక్రాన్ భయం వెంటాడుతోంది. దీని ప్రభావం 2022 సంవత్సరంలో జరిగే ప్రయోగాలకు బ్రేక్ పడుతుందేమోనని శాస్త్రవేత్తలు ఆందోళన చెందుతున్నారు. గడిచిన రెండేళ్లలో ఎంతో సాధించాలని అనుకున్న ఇస్రోకు కరోనా మహమ్మారి పూడ్చుకోలేని నష్టాన్ని మిగిల్చింది. ఎస్ఎస్ఎల్వీ అనే నూతన రాకెట్ ప్రయోగం, చంద్రయాన్-3, గగన్‌యాన్-1 ప్రయోగాలకు సంబంధించి కొన్ని ప్రయోగాత్మక పరీక్షలు కూడా నిర్వహించి అంతా సిద్ధం చేసుకుంటున్న తరుణంలో ఒమిక్రాన్‌తో అన్ని ప్రయోగాలకు బ్రేక్ పడింది. దేశంలోని ప్రధానంగా 11 ఇస్రో సెంటర్లలో రాకెట్స్, శాటిలైట్స్‌కు సంబంధించిన కార్యక్రమాలన్నీ ఊపందుకున్న సమయంలో ఒమిక్రాన్‌తో మందగించాయి. రాబోయే 2022 సంవత్సరంలో ఇస్రో మరెన్నో అద్భుతమైన భారీ ప్రయోగాలు చేసేందుకు కసరత్తు ప్రారంభించింది. ఒమిక్రాన్ తీవ్ర రూపం దాల్చితే 2022 సంవత్సరం కూడా రాకెట్ ప్రయోగాలకు అవరోధం ఏర్పడే అవకాశాలు లేకపోలేదని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గడిచిన ఐదేళ్లలో 22 ప్రయోగాలు చేశారు. 2020, 2021 తప్ప మిగిలిన మూడేళ్లు ఆరు ఏడు ప్రయోగాలకు తగ్గకుండా చేయడం విశేషం.

వాణిజ్య పరంగా వెనుకబడిన ఇస్రో

గత కొన్నేళ్లుగా వాణిజ్య పరంగా ఇస్రో తిరుగులేని శక్తిగా అవతరించింది. విదేశీ ఉపగ్రహాలను ఇస్రో రాకెట్ల ద్వారా పంపించి ఏడాదికి సుమారు రూ.వెయ్యి కోట్ల మేర ఆదాయాన్ని తీసుకొచ్చిన ఘనతను సొంతం చేసుకుంది. 1999 నుంచి 2021 వరకు తీసుకుంటే 34 దేశాలకు చెందిన 342 ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ రాకెట్ల ద్వారా పంపించి ఏడాదికి రూ. వెయ్యి కోట్లకు తగ్గకుండా వ్యాపారం చేశారు. 2017లో 29 విదేశీ ఉపగ్రహాలు, 2018లో 33, 2019లో 14 విదేశీ ఉపగ్రహాలను పంపించి ఆదాయ వనరులను పెంచుకున్న ఇస్రో 2020, 2021 సంవత్సరాల్లో ఈ సంఖ్య బాగా తగ్గిపోయింది. కేవలం 2020లో 3, 2021లో 3 విదేశీ ఉపగ్రహాలను పంపించి సరిపెట్టుకుంది. కరోనా మహమ్మారి పుణ్యమా అని దేశీయంగా సాంకేతిక పరిజ్ఞానం పెంచుకునే ప్రయోగాలకు బ్రేక్ పడడమే కాకుండా వాణిజ్య పరంగా విదేశీ ఉపగ్రహాల ప్రయోగాలు కూడా తగ్గిపోవడంలో ఆదాయ వనరులు తగ్గాయి. అయితే శ్రీహరికోట రాకెట్ కేంద్రం భూ మ్యధ్య రేఖకు 13 డిగ్రీల అక్షాంశంలో ఉండడం, గ్రావిటీ తక్కువగా ఉండడం వల్ల ఇంధనం ఖర్చు తగ్గడంతో తక్కువ ధరలకే విదేశీ ఉపగ్రహాలను ప్రయోగించడంతో మరిన్ని దేశాలకు చెందిన ఉపగ్రహాలను కూడా ఇక్కడి నుంచి పంపించుకోవడానికి పలు దేశాలు ఇప్పటికే ఇస్రోతో ఒప్పందం కూడా చేసుకున్నాయని తెలుస్తోంది. కరోనా నేపథ్యంలో ఇస్రోకు తీరని నష్టం వాటిల్లిందని చెప్పొచ్చు.

## ఎస్సీ కమిషన్ చైర్మన్ ను కలసిన గోగులమూడి రాజు



విజయవాడ,ప్రజాపాలన ప్రతినిధి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 30 సంవత్సరాల పైబడి దళిత ఉద్యమాలలో అంబేద్కర్ ఆలోచన విధానంతో పనిచేస్తూ న్యాయవాదిగా దళిత గిరిజనులకు ఎన్నో సేవలందించిన వ్యక్తి నిరంతర పోరాట యోధుడు శ్రామికుడు మారుమూడి విక్టర్ ప్రసాద్ కి ఎస్సీ కమిషన్ చైర్మన్ పదవిని ఇవ్వడం ఏంతో హర్షించదగ్గ విషయం అని మాల మహానాడు కృష్ణ జిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు . ఈ రోజు విజయవాడ ఆయన కార్యాలయంలో దుశ్శాలువా తో ఘనంగా సత్కరించి గోగులమూడి రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో లో ఎస్సీ ఎస్టీ లకు సంబంధించిన కేసులను అధికారులు పక్కదారి పట్టిస్తూన్నారని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో ముద్దాయిలకు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా చూడాలని అలాగే రాష్ట్రంలో సివిల్ రైట్స్ డే పేరిట ప్రతి నెల చివరి రోజులలో జరగవలసిన కార్యక్రమాలు జరిపించడం లో అధికారులు పూర్తిస్థాయి నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని అలాగే ఇప్పటికే రాష్ట్రంలో పెండింగ్లో ఉన్న కేసులను చార్జిషీట్లు ద్వారా ముందుకు నడిపి ముద్దాయిలకు కఠినతరమైన శిక్షపడేలా చూడాలని దానితో పాటు రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ పై శ్రద్ధ పెట్టి ఆ కమిటీ ద్వారా పెండింగ్ కేసుల తో పాటు ఎక్స్గ్రేషియా లు కూడా త్వరితగతిన బాధితులకు అందేలా చూడాలని ఎస్సీ కమిషన్ చైర్మన్ శ్రీ మారుమూడి విక్టర్ ప్రసాద్ కు మెమోరాండం ఇవ్వడం జరిగింది.వెంటనే స్పందించిన ఎస్సీ కమిషన్ చైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ వీటన్నింటిపై త్వరలో ప్రతి జిల్లాలో రివ్యూ మీటింగ్ ద్వారా ప్రతి పెండింగ్ కేసులను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వర్రె చిట్టి బాబు, గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంతోని. యువజన అధ్యక్షుడు పోనుగుమాటి ఉదయభాస్కర్. పెనమలూరు నియోజకవర్గ అధ్యక్షుడు పైయర్ధ రామకృష్ణ.పామర్రు నియోజకవర్గ అధ్యక్షులు పిడుగు వెంకటేశ్వరరావు. మారుమూడి రాంబాబు. తదితరులు పాల్గొన్నారు ..



## ఎగ్జిబిషన్లలతో మానసిక ఉల్లాసం

భీమవరం, డిసెంబర్ 30 (ప్రజాపాలన ప్రతినిధి) :ఉల్లాసం, ఉత్సాహం కోసం ఎగ్జిబిషన్లు ఎంతగానో ఉపయోగపడతాయని విజయవాడకు చెందిన గోపీనాథ్, షేర్ ఖాన్ లు భీమవరంలో ఎస్ఎస్ఎం ఇస్ మెంట్ పేరుతో ఎగ్జిబిషన్ ఏర్పాటుచేయడం అభినందనీయమని వైసిపి యూత్ రాష్ట్ర నాయకులు గ్రంధి రవితేజ అన్నారు. గురువారం రాత్రి లూథరన్ గ్రౌండ్లో ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్ ను ఆయన ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పండుగకు, మావుళ్ళమ్మ ఉత్సవాలకు భక్తులు, పర్యాటకులు పెద్దఎత్తున భీమవరం పట్టణానికి వస్తారని వారికి ఈఎగ్జిబిషన్ ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కందికట్ల ఎడ్వర్డ్, సుంకర బాబురావు, జలాలుద్దీన్ బాబా ,చిగురుపాటి సందీప్, తోట భోగయ్య, ము ల్లి శ్రీనివాసరావు, కొట్టి కుటుంబరావు చెల్లబోయిన సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గుల పోటీల్లో అలరించిన విద్యార్థినిలు



## జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత హైస్కూల్ లో ఘనంగా భాషోత్సవాలు

కావలి డిశంబర్ 30 ప్రజాపాలన ప్రతినిధి :విద్యా శాఖ ఆదేశానుసారంగా భాషోత్సవాలలో భాగంగా కావలి పట్టణం పాతవూరులోని జిల్లా ప్రజా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల నందు ఘనంగా భాషోత్సవాలు నిర్వహిస్తున్నారు మొదటిరోజు ఇంగ్లీష్ రెండో రోజు హిందీ ఉర్దూ భాషోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మూడో రోజు గురువారం తెలుగు భాషోఉత్సవ సందర్భంగా రెండు వందల మంది విద్యార్థుల తో జాతీయ భాష, రాష్ట్రీయ భాష, ప్రాంతీయ భాష(ఉర్దూ, తెలుగు) లో అలాగే ఇంగ్లీషు అచ్చుల రూపంలో విన్యాసాలు చేసారు. ముగ్గుల పోటీలు నిర్వహించి వాటిలో మొదటి ద్వితీయ తృతీయ స్థానంలో నిలిచిన విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు.సీనియర్లలో మొదటి బహుమతి సుజాత, రెండో బహుమతి లక్ష్మి, మూడో బహుమతి పావని,నాల్గో బహుమతి పూజిత అందజేశారు. జూనియర్ లో మొదటి బహుమతి మృధులత శ్రీ, రెండో బహుమతి సంధ్యా, మూడో బహుమతి పర్వీన్, నాలుగో బహుమతి స్నేహలత కు అందజేశారు.ఈ కార్యక్రమాలన్ని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ప్రభవతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో సోషల్ ఉపాధ్యాయులు సుకుమార్, ఉపాధ్యాయిని లు తనుజ,వాణి, చాయా కుమారి, రేవతి, సుహాసిని, హైమావతి,బిబిజాన్, కోటేశ్వరిఅలాగే మిగిలిన ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది స్కూలు విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఇక అంతరిక్షాలలో యుద్ధమేనా..?

అగ్రరాజ్యాల మధ్య అంతరిక్ష యుద్ధం జరగబోతుందా.. అమెరికా, చైనాల మధ్య అంతరిక్ష యుద్ధానికి శ్రీకారం చూడుతున్నాయా అంటే అవుననే సమాధానం వస్తుంది. అంతరిక్షంలో వారు పోటాపోటీగా ఏర్పాటు చేస్తున్న స్పేస్ సెంటర్లే యుద్ధానికి కారణం కాబోతున్నట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ కేంద్రం ఐఎస్ఎస్?కు పోటీగా చైనా తియాంగాంగ్ కేంద్రం ఏర్పాటు చేసింది. ఎలాన్ మస్క్ స్పేస్ ఎక్స్ ఉపగ్రహాలు తియాంగాంగ్?పై దాడికి యత్నించాయంటూ చైనా ఆగ్రహం వ్యక్తం చేసింది. నిర్ణీత కక్ష్యను దాటి తియాంగాంగ్?ను ఢీకొనే దూరానికి వచ్చిన స్పేస్ ఎక్స్ సంస్థ ప్రయోగించిన ఉపగ్రహాలు వెళ్లినట్లు ఆరోపిస్తోంది. చైనా అంతరిక్ష పరిశోధనలను లక్ష్యంగా చేసుకుని కావాలని స్పేస్ ఎక్స్ సంస్థ ఈ పనిచేసిందని అనుమానాలు వస్తున్నాయి. ఇప్పటికే అమెరికా, చైనా మధ్య ఉపగ్రహ ప్రయోగాలు, అంతరిక్ష కేంద్రం ఏర్పాటులో ఉద్రిక్తతలు నెలకొన్నాయి. రెండు దేశాల మధ్య ఇప్పటికే ప్రారంభమైన ప్రచ్ఛన్న అంతరిక్ష యుద్ధం మొదలైనట్లు కనిపిస్తోంది.అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి(ఐఎస్ఎస్) పోటీగా చైనా తన అంతరిక్ష కేంద్రం 'తియాంగాంగ్' నిర్మిస్తోంది. భూమి దిగువ కక్ష్య (భూమి నుంచి 340 కి.మీ నుంచి 450 కి.మీ ఎత్తు)లో తియాంగాంగ్ నిర్మాణం కొనసాగుతోంది. ఇందులో భాగంగా 2021 ఏప్రిల్ 29న తియాన్హే మాడ్యూల్?ను విజయవంతంగా ప్రయోగించింది. తియాంగాంగ్ అంతరిక్ష కేంద్రం నిర్మాణానికి 11 మాడ్యుల్లను ప్రయోగించనుంది. అనంతరం ముగ్గురు క్రూ సిబ్బందిని షెంజూ-13 అంతరిక్ష నౌక ద్వారా తియాన్హే మాడ్యూల్ వద్దకు చేర్చింది. మాడ్యూల్ ద్వారా పరికరాలతో తియాంగాంగ్?లో చైనా వ్యోమగాములు పనులు చేపట్టింది. అంతరిక్ష కేంద్రం తియాంగాంగ్ పనులు 2022 నాటికి పూర్తవుతాయని చైనా చెబుతోంది. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న తియాంగాంగ్ భూమికి 390 కి.మీ ఎత్తు కక్ష్యలో పరిభ్రమిస్తోంది. భూ దిగువ కక్ష్యలో కృత్రిమ గ్రహాల సంఖ్య పెరుగుతుండడంతో కక్ష్య మార్గాలు ఇరుగ్గా మారుతున్నాయి. అమెరికా పారిశ్రామిక వేత్త ఎలన్ మస్క్ కంపెనీ స్పేస్ ఎక్స్ కంపెనీ స్టార్ లింక్- 1095 ఉపగ్రహం ప్రయోగించింది. ఇప్పటికే 2000 వరకు శాటిలైట్స్ ప్రయోగించారు. 12,000 శాటిలైట్లను ప్రయోగించేందుకు ఇప్పటికే స్పేస్ ఎక్స్?కు అమెరికా అధికార సంస్థ అనుమతిచ్చింది. ఈ శ్రేణిలోనిదే స్టార్ లింక్ 1095 ఉపగ్రహం. నిజానికి స్టార్ లింక్ 1095 కక్ష్య 555 కి.మీ ఎత్తులో ఉంటుంది. 2021 మే 16 నుంచి జూన్ 24 వరకు అది కిందికి వచ్చి 382 కి.మీ ఎత్తులోకి కక్ష్యలో ప్రవేశించింది. 2021 జులై 1న తియాంగాంగ్?కు అతిచేరువగా వచ్చింది.ముప్పును పసిగట్టిన చైనా వ్యోమగాములు తియాంగాంగ్?ను అతి కష్టంగా స్టార్ లింక్ మార్గం నుంచి తప్పించారు. 2021 సెప్టెంబర్?లో భూ వాతావరణంలోకి ప్రవేశించిన స్టార్ లింక్ 1095 కాలిపోయింది. ఇటీవల అక్టోబర్?లో స్టార్ లింక్ 2305 ఉపగ్రహం సైతం కక్ష్యను మార్చుకుంటూ తియాంగాంగ్? సమీపంలోకి వచ్చింది. అప్పుడు తియాంగాంగ్ వ్యోమగాములు కక్ష్యను తప్పించి ప్రమాదం నుంచి గట్టెక్కించారు. అనంతరం స్టార్ లింక్ 2305 ఉపగ్రహం 550 కి.మీ కక్ష్యలోకి చేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.స్పేస్ ఎక్స్ ఉపగ్రహాల కారణంగా రెండు సార్లు తియాంగాంగ్ ప్రమాదం అంచుల్లోకి వెళ్లడంతో ఆగ్రహంతో చైనా ఆగ్రహంగా ఉంది. వియాన్నాలోని ఐక్యరాజ్య సమితి స్పేస్ ఏజెన్సి కి ఫిర్యాదు చేసింది. అంతర్జాతీయ స్పేస్ లా ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు నడుచుకోవాల్సి ఉంటుంది. అమెరికాతో పాటు చైనా సైతం అంతరిక్షాన్ని ఉపగ్రహాలతో నింపివేస్తున్నదని హార్వర్డ్ ఖగోళ శాస్త్రవేత్త మెక్ డోవెల్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 2007లో యాంటి శాటిలైట్ పరీక్షలను చైనా మిలిటరీ జరిపిందని వెల్లడించారు.చైనా అంతరిక్ష ప్రయోగాలతో అంతరిక్షంలో అమెరికా ఆధిపత్యానికి సవాల్ మొదలైందని నాసా పాలనాధికారి బిల్ నీల్సన్ అన్నారు. అమెరికాకు చైనా ఏకైక పోటీ దేశంగా మారిందని వ్యాఖ్యానించారు. చంద్రునిపైకి మనుషులను తీసుకుపోయే ప్రాజెక్టుకు అమెరికన్ పార్లమెంట్ కాంగ్రెస్ నిధులు మంజూరు చేయాలని నీల్సన్ కోరారు. ఇప్పటివరకు అంతరిక్షంలో ఐఎస్ఎస్ ఉండగా తాజాగా చైనా తియాంగాంగ్ కేంద్రం రానున్న నేపథ్యంలో అంతరిక్ష కార్యక్రమాల్లో ఇరుదేశాల మధ్య తీవ్రమైన పోటీ ఉండనుంది. 1998లో ఏర్పాటైన ఐఎస్ఎస్ నిర్మాణంలో అమెరికా, రష్యా, యూరోప్, జపాన్, కెనడా పాలుపంచుకున్నాయి. 23 ఏళ్లలో 19 దేశాలకు చెందిన 200కు పైగా వ్యోమగాములు ఐఎస్ఎస్ సందర్శించారు. కానీ వీరిలో చైనా వ్యోమగాములు లేరు.గూఢచారం వ్యవహారంలో కాంగ్రెస్ ది వుల్ఫ్ అమెండ్ మెంట్ (సవరణ) ఆమోదించిన తర్వాత చైనాకిచ్చే సహకారం నిలిపివేశారు. ఈ నేపథ్యంలో సొంతంగా స్పేస్ స్టేషన్ నిర్మించాలని చైనా నిర్ణయం తీసుకుంది. ఈ వ్యూహంలో భాగంగా తియాంగాంగ్ స్పేస్ స్టేషన్ నిర్మిస్తోంది. మరోవైపు ఐఎస్ఎస్ 2024లో విరమించాలని నాసా భావిస్తోంది. ఐఎస్ఎస్ జీవిత కాలం పొడిగించాలన్నదానిపై ప్రాజెక్టులో పాలుపంచుకున్న దేశాలనుంచి ఇప్పటివరకు స్పందన లేకపోవడంతో అమెరికాపై ఒత్తిడి నెలకొంది. ఐఎస్ఎస్ విరమణ జరిగితే అంతరిక్షంలో మిగిలే ఒకే ఒక అంతరిక్ష కేంద్రం చైనా తియాంగాంగ్ మాత్రమే అవుతుంది. ఈ నేపథ్యంలో తాజా పరిణామాలు అమెరికాకు మింగుడు పడడం లేదు.చైనా చర్యలతో ఆ చైనా, అమెరికాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా-చైనా మధ్య నెలకొన్న విరోధం అమెరికా-సోవియట్ యూనియన్(రష్యా)తో ప్రచ్ఛన యుద్ధం వాతావరణాన్ని తలపిస్తోంది. మరోవైపు తమ తియాంగాంగ్ కేంద్రంలో పాలుపంచుకోవాలని చైనా విదేశీ వ్యోమగాములకు ఆహ్వానిస్తోంది. చంద్రుడి దక్షిణ ధ్రువంపై 2035 నాటికి రష్యాతో కలిసి సంయుక్త పరిశోధన కేంద్రాన్ని చైనా ఏర్పాటు చేయనుంది. చంద్రుడిపై పరిశోధన, బాధ్యతాయుతమైన ప్రయోగాలు చేపట్టేందుకు అమెరికా నేతృత్వంలో అంతర్జాతీయ సంకీర్ణం బృందం ఏర్పాటు అయింది. 2020 మే నెలలో విడుదల చేసిన అర్టిమిస్ ఒప్పందంగా పిలుస్తున్న ఈ పత్రంపై ( అమెరికా, ఆస్ట్రేలియా, కెనాడా, జపాన్, లక్సెంబర్గ్, ఇటలీ, యూకే, యూఏఈ, ఉక్రెయిన్, దక్షిణ కొరియా, న్యూజిలాండ్, బ్రెజిల్) 12 దేశాలు సంతకాలు చేశాయి. ఈ ఒప్పందంపై చైనా, రష్యాలు సంతకం చేయలేదు.



# బాక్సాఫీస్ వసూళ్లపై చరణ్ ఏమన్నారంటే?



పాన్ ఇండియా చిత్రం ఆర్.ఆర్.ఆర్ రిలీజ్ నేపథ్యంలో టీమ్ అంతా ప్రచారంలో బిజీ అయిన సంగతి తెలిసిందే. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్..యంగ్ టైగర్ ఎన్టీఆర్..దర్శక ధీరుడు రాజమౌళి అన్ని మెట్రో నగరాల్ని చుట్టేస్తున్నారు. దొరికిన ప్రతి వేదికను ఆర్ ఆర్ ఆర్ ప్రచారంతో హెూరెత్తిస్తున్నారు. ముఖ్యంగా బాలీవుడ్ లో సినిమాని ఏ రేంజ్ లో ప్రమోట్ చేస్తున్నారో తెలిసిందే. తాజాగా అనుపమ్ చోప్రాతో జరిగిన ఫిల్మ్ కంపానియన్ చిట్ చాట్ లో చరణ్ పలు ఆసక్తిర విషయాలు చెప్పుకొచ్చారు. బాక్సాఫీస్ వసూళ్ల వ్యవహారం అన్నివేళలా హాట్ టాపిక్ గా మారుతుంటుంది. దీని గురించి చరణ్ తెలివైన సమాధానాలు ఇచ్చారు. సినిమా రిలీజ్ అయిన రెండు.. మూడు రోజుల వరకూ అందులో నటించిన నటీనటులు.. దర్శకుడి నైపణ్యం ఎలా ఉంటుంది..? అన్నది ఆసక్తికర చర్చకు దారి తీసింది. మొదటి మూడు రోజుల పాటు పెద్ద హీరోల్లో ఎవరికీ టెన్షన్ ఉండదని.. నిర్మాతలు.. పంపిణీదారులు ఎలాంటి కంగారు పడరని అన్నారు. తాము అనుకున్న ఫిగర్ సినిమా మూడు రోజుల్లోనే సాధించేస్తుందని అన్నారు. ఎన్నో సినిమాల ఫలితాల్ని విశ్లేషించుకున్న తర్వాతనే ఇలాంటి అంచనాకి వచ్చినట్లు చరణ్ తెలిపారు. తనని నమ్మి డబ్బు ఖర్చు పెట్టి సినిమా చేసిన నిర్మాత ఎప్పుడూ సేఫ్ జోన్ లో ఉండటం కోసమే తాను ప్రయత్నిస్తానని అన్నారు. అయితే 500 కోట్లు ఖర్చు చేసినప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడనందుకు నాకు ఎలాంటి అభ్యంతరం లేదు. ఏడు రోజుల తర్వాత మాట్లాడినా ఎలాంటి అభ్యంతరం లేదు. కానీ ఈ సినిమా ఎప్పటికీ లైబ్రరీలో నిలిచిపోతుంది. ముందుగా మేం ఎంపిక చేసుకున్న నంబర్ ని అయితే కచ్చితంగా దాటుతాం. మా నిర్మాతలు..పంపిణీదారులు సురక్షితంగా ఉన్నారన్న నమ్మకం ఉంది అని చరణ్ అన్నారు. ఆర్.ఆర్.ఆం చిత్రం జనవరి 7న రిలీజ్ అవుతోన్న సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి రాజమౌళి దర్శకత్వం వహించారు. డి.వి.వి. దానయ్య భారీ బడ్జెట్ తో నిర్మించారు. మొత్తానికి ఒమిక్రాన్ టెన్షన్ లో ఉన్న బయ్యరులో నమ్మకాన్ని పెంచేందుకు చరణ్ వ్యాఖ్యలు సహకరించవచ్చు. ఆశించిన వసూళ్లను సాధించగలమన్న ధీమా ఇక ప్రాక్టికల్ గానూ ప్రూవ్ కావాల్సి ఉంది. మరో వారంలోనే రిలీజ్ కి వస్తున్న ఆర్.ఆర్.ఆర్ కి ఒమిక్రాన్ సెగ ఉండదనే అంతా ఆకాంక్షిద్దాం. ఒక రకంగా ఒమిక్రాన్ వల్ల మరణాలు నమోదు కాకపోవడం కొంతవరకూ జనాల్లో స్థైర్యాన్ని నింపుతోంది. ఇది ఒక రకంగా పాజిటివ్ యాంగిల్ అని చెప్పాలి.

# 'యశోద'లో సమంత రోల్ పై క్లారిటీ




సమంత ప్రధాన పాత్రలో యశోద చిత్రం తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. హరి-హరీష్ అనే ఇద్దరు కొత్త కుర్రాళ్లు ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. అయితే ఇప్పటివరకూ యశోదలో సమంత రోల్ ఎలా ఉంటుంది? యశోద కంటెంట్ ఎలా ఉండబోతోంది? అన్నది ఎక్కడా లీక్ అవ్వలేదు. తాజాగా సామ్ పాత్ర వివరాలు లీక్ అయ్యాయి. ఇందులో సమంత నర్సు పాత్రలో కనిపిస్తోంది. ఆ పాత్ర చుట్టూనే కథ అంతా తిరుగుతుందని ఇది సస్పెన్స్ థ్రిల్లర్ చిత్రంగా ఆద్యంతం ఆకట్టుకుంటుందని టాక్ వినిపిస్తోంది. సమంత పాత్ర చాలా ఆసక్తికరంగా ఛాలెంజింగ్ గా ఉంటుందని.. థ్రిల్లర్ అంశాలు.. ట్విస్టులు ఊహకందని విధంగా ఉంటాయని.. గ్రిప్పింగ్ స్క్రీన్ ప్లేతో కథ సాగుతుందని అంటున్నారు. ఇప్పటికే మొదటి షెడ్యూల్ ని కేరళలో పూర్తి చేసారు. మరో షెడ్యూల్ తో షూటింగ్ పూర్తవుతుందని సమాచారం. అన్ని పనులు పూర్తి చేసి సమ్మర్ కానుకగా ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలని మేకర్స్ టార్గెట్ గా పెట్టుకున్నట్లు సమాచారం. సమంతకి ఇది రెండవ లేడీ ఓరియేంటెడ్ చిత్రం. గతంలో ఓ బేబి లో నటించింది. ఇందులో క్రైమ్ ఇన్వెస్టిగేషన్ జర్నలిస్ట్ పాత్రలో ఆద్యంత ఆకట్టుకుంది. ఈ సినిమా యావరేజ్ గా ఆడింది. నటిగా సమంతకు మంచి పేరు తీసుకొచ్చింది. ఇక %--%యశోద%--%తో ఎంతగా రీచ్ అవుతుందో చూడాలి. ఇంకా సమంత చేతిలో మరికొన్ని తెలుగు..హిందీ ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అలాగే ఓ అంతర్జాతీయ చిత్రంలోనూ నటించనుంది. రాజ్ అండ్ డీకే తో మరో వెబ్ సిరీస్ కోసం రెడీ అవుతోంది. ఇలా సామ్ నటిగా బిజీగానే ఉంది. ఇటీవలే సమంత పాన్ ఇండియా చిత్రం పుష్ప లో ఐటం పాటలో నర్తించిన సంగతి తెలిసిందే. ఊ అంటావా మావ..ఊఊ అంటావా పాటతో ఒక్కసారిగా అభిమానులను ఓ ఊపు ఊపేసింది. ఈ పాట యూట్యూబ్ సహా సోషల్ మీడియాల్లో యాప్ లలో వైరల్ గా దూసుకెళ్లింది. ప్రస్తుతం వార్తా చానెళ్లు పొలిటికల్ సెటైర్లకు బ్యాక్ గ్రౌండ్ గా ఉపయోగించేస్తున్నాయ్. ఇక ఓబేబిలో వృద్ధ గెటప్ తో ఆకట్టుకున్న సామ్ తదుపరి హాటెస్ట్ నర్స్ గా కనిపించనుందా? అంటూ ఊహాగానాలు సాగుతున్నాయి.

# రామారావు ఆన్ డ్యూటీ పై లేటెస్ట్ అప్డేట్!




రవితేజ హీరోగా శరత్ మండవ దర్శకత్వం లో తెరకెక్కుతున్న తాజా చిత్రం రామారావు ఆన్ డ్యూటీ. శ్రీ లక్ష్మి వేంకటేశ్వర సినిమాస్ మరియు ఆర్టి టీమ్ వర్క్స్ పతాకంపై ఈ చిత్రాన్ని సుధాకర్ చెరుకూరి నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కి సంబంధించిన ప్రచార చిత్రాలు ఇప్పటికే విడుదల అయి ప్రేక్షకులను, అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఈ చిత్రం కి సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ పై చిత్రం యూనిట్ సోషల్ మీడియా వేదిక గా ఒక ప్రకటన చేయడం జరిగింది. ఈ చిత్రం కి సంబంధించిన రిలీజ్ డేట్ ను త్వరలో ప్రకటిస్తాం అని వెల్లడించడం జరిగింది. అంతేకాక వచ్చే ఏడాది 2022 వైరస్ ఫ్రీ గా ఉండాలని, అంతేకాక భవిష్యత్ మొత్తం కూడా అదే విధంగా ఉండాలి అంటూ కోరుకుంటూ డైరెక్టర్ శరత్ మండవ సోషల్ మీడియా వేదిక గా వెల్లడించడం జరిగింది. ఈ చిత్రం లో దివ్యాన్ష కౌశిక్ హీరోయిన్ పాత్రలో నటిస్తుండగా, సామ్ సి. ఎస్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది విడుదల చేసేందుకు చిత్ర యూనిట్ సన్నాహాలు చేస్తుంది.

# పుష్ప హిందీ వెర్సన్ 13రోజుల్లో 45కోట్లు



స్టైలిష్ స్టార్ అల్లు అర్జున్ నటించిన పుష్ప- ది రైజ్ మూడోవారంలోను అద్భుత వసూళ్లను సాధిస్తోంది. ఇంటా బయటా ఈ సినిమా సాధించిన వసూళ్లు హాట్ టాపిక్ గా మారాయి. పుష్ప-ది రైజ్ గ్లోబల్ బాక్సాఫీస్ వద్ద రూ. 300 కోట్లు వసూలు చేస్తుందని నిర్మాతలు అంచనా వేస్తున్నారు. పుష్ప హిందీ బాక్సాఫీస్ వద్ద అద్భుతంగా రన్ అవుతోంది. ఈ చిత్రం మంగళవారం 20 శాతం మైనర్ డిప్ ను నమోదు చేసినా కానీ ముంబై సర్క్యూట్ లో మంచి ప్రదర్శనను కొనసాగిస్తోంది. రూ. 2.50 కోట్ల నెట్ తో.. పుష్ప (హిందీ) మొత్తం వసూళ్లు రూ. 45.50 కోట్ల నికర విలువను నమోదు చేశాయి. దీనికి సంబంధించి చిత్రబృందం అధికారికంగా వసూళ్ల ఫిగర్ ని ముద్రించి పోస్టర్ ని విడుదల చేసింది. పుష్ప హిందీ వెర్షన్ 13 రోజుల్లో 45.5 కోట్లను వసూలు చేసిందని వెల్లడించింది. అయితే అనూహ్యంగా ఒమిక్రాన్ పుష్పకు పంచ్ ఇస్తోంది. ఢిల్లీలో సినిమా థియేటర్లు మూతపడడంతో 'పుష్ప' హిందీ కలెక్షన్లపై ప్రభావం పడనుందని భావిస్తున్నారు. అయితే 'పుష్ప' హిందీకి మహారాష్ట్ర- గుజరాత్ ల నుంచి అత్యధికంగా 60 శాతం వసూళ్ల దందా సాగింది. రెండవ వారంలో పుష్ప హిందీ మొదటి వారం కలెక్షన్ కు దాదాపు 20 కోట్లను జోడించవచ్చని అంచనా. మొదటి వారం కంటే 25 శాతం డ్రాప్ ను నమోదు చేసినా ఇది మంచి ఫలితం కిందే లెక్క. పుష్ప వాస్తవానికి తెలుగు భాషను దృష్టిలో పెట్టుకుని తెరకెక్కించిన యాక్షన్ డ్రామా. ఇది మలయాళం- తమిళం- కన్నడ - హిందీ భాషల్లో విడుదలైంది. అల్లు అర్జున్- రష్మిక మందన్న- ఫహద్ ఫాసిల్ ప్రధాన పాత్రల్లో నటించిన ఈ ఎంటర్ టైనర్ కి సుకుమార్ రచన -దర్శకత్వం వహించారు. డిసెంబర్ 17న విడుదలైన ఈ సినిమా సినిమాలోని ఓ రొమాంటిక్ సన్నివేశంపై ఓ వర్గం ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. బహిరంగ ప్రదేశంలో ప్రేయసి అందాలను తాకే హీరో సీన్ ని ఆ హావభావాలను తొలగించాలని డిమాండ్ చేసారు కొందరు జనం. వాన్ సీన్ లేదా టిఫిన్ సీన్ పై వివాదం నడిచింది. తరువాత మేకర్స్ వివాదాస్పద సన్నివేశాన్ని తొలగించారు. అయినా పుష్ప కు ఇతర భాషల్లో ఆ ఇబ్బంది లేదు.

# అమలాపాల్ కు అరుదైన పురస్కారం..!



యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ప్రకటించే అత్యంత ప్రతిష్టాత్మకమైన పురస్కారం గోల్డెన్ పీకాక్. అయితే ఈ గోల్డెన్ పీకాక్ అనే అవార్డును దక్షిణ భారత నటి అయినటువంటి అమలాపాల్ కు ఇస్తున్నట్లు అక్కడి ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటివరకు ఇలాంటి గోల్డెన్ పీకాక్ అవార్డు పొందిన అతి తక్కువ మంది జాబితాలో అమలాపాల్ చేరింది. ఈ అత్యంత అరుదైన అవార్డు దక్కించుకోవడం నిజంగా ఎంతో సంతోషంగా ఉన్నట్లు అమలాపాల్ తెలిపింది. భారతదేశంలో అతి తక్కువ మందికి ఇచ్చినటువంటి ఈ గోల్డెన్ పీకాక్ అవార్డు సొంతం చేసుకోవడం నిజంగా అదృష్టంగా భావిస్తున్నట్లు అమలాపాల్ పేర్కొంది. ఈ అత్యంత అరుదైన గోల్డెన్ పీకాక్ పురస్కారాన్ని యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రభుత్వం ప్రతి ఏటా ప్రకటిస్తుంది. ఇప్పటికే భారత దేశంలో కొంత మందికి ఈ అవార్డు ఇచ్చింది. అందం అభినయంతో పాటు సీన్ ను బట్టి అందాల ఆరబోతకు కూడా వెనకాదాని నటి అమలాపాల్. తనదైన శైలిలో అమలాపాల్ నటిస్తుంది తెలుగు తమిళం మలయాళం లో నటించిన అమలాపాల్ దక్షిణాది ప్రేక్షకులకు మర్చిపోలేని సినిమా ఇచ్చింది అంతే కాకుండా దక్షిణాది ఉండే అనేక మంది అగ్ర హీరోల సరసన కూడా అమలాపాల్ నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. బెజవాడ నాయక్ లవ్ ఫెయిల్యూర్ ఇద్దరమ్మాయిలతో జెండా పై కపిరాజు పిట్టకథలు ఇలాంటి తెలుగు సినిమాలు చేసి ఎంతోమంది అభిమానులను సొంతం చేసుకుంది. అంతేకాకుండా ఇటీవల ఆమె నటించిన టువంటి ఆమె చిత్రం ఒక విలక్షణమైన గుర్తింపు తెచ్చిపెట్టింది. అమలాపాల్ కేవలం చిత్రాలు మాత్రమే పరిమితం కాలేదు. వెబ్ సిరీస్ లో కూడా నటిస్తోంది. ఆహా అనే ఓటిటి లో ప్రసారమయ్యే కుడిఎడమైతే అనే వెబ్ సిరీస్ లో అమలపాల్ నటిస్తుంది. అమలాపాల్ నటించిన టువంటి మైనా అనే చిత్రం ఎంతో మంది విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఈ చిత్రానికి ఆమెకు అనేక అవార్డులు వచ్చాయి. ఫస్ట్ డబ్ల్యూ ఫిలిం మైనా కు ఆమెకు ఉత్తమ నటి అవార్డు వచ్చింది. ఇక గోల్డెన్ పీకాక్ అవార్డు విషయానికి వస్తే... ఈ అవార్డు ఇటీవల మెగా కుటుంబానికి చెందిన రామ్ చరణ్ భార్య ఉపాసన కు కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రకటించింది. అయితే ఈ అవార్డును ఇప్పటికే భారత దేశంలో చాలామంది సొంతం చేసుకున్నారు. బాలీవుడ్ నటుడు షారుక్ ఖాన్ మొట్టమొదట ఈ అవార్డును భారతదేశం నుంచే సొంతం చేసుకున్న వ్యక్తిగా నిలిచారు. గతంలో కూడా ఎంతో మంది మలయాళ నటులు ఈ అవార్డును అరబ్ ఎమిరేట్స్ ప్రకటించిన విషయం తెలిసిందే.

# లైగర్ బిటీఎస్ స్టిల్స్ ను రిలీజ్ చేసిన టీమ్!




విజయ్ దేవరకొండ హీరోగా పూరీ జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం లైగర్. ఈ చిత్రానికి సాలా క్రాస్ బ్రీడ్ అనేది ఉప శీర్షిక. ధర్మ ప్రొడక్షన్స్ మరియు పూరి కనెక్ట్స్ ల పై ఈ చిత్రాన్ని సంయుక్తం గా నిర్మిస్తున్నారు. ఈ చిత్రం కి సంబంధించిన ప్రచార చిత్రాలు ఇప్పటికే విడుదల అయి ప్రేక్షకులను అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. తాజాగా ఈ చిత్రం కి సంబంధించిన వరుస అప్డేట్స్ ను చిత్ర యూనిట్ విడుదల చేస్తూ ఫ్యాన్స్ ను, ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుంది. ఈ చిత్రం కి సంబంధించిన ఎక్స్ క్లూజివ్ బిటీఎస్ స్టిల్స్ ను చిత్ర యూనిట్ తాజాగా విడుదల చేయడం జరిగింది. ఇందులో పూరి జగన్నాథ్ మరియు హీరో విజయ్ దేవరకొండ చర్చించుకుంటున్న ఫోటో ఒకటి మరియు విజయ్ కెమెరా తో ఉన్న ఫోటో ఒకటి షేర్ చేయడం జరిగింది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ గా మారాయి. పాన్ ఇండియా మూవీ గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో హీరోయిన్ గా అనన్య పాండే నటిస్తుంది. ప్రముఖ లెజెండరీ బాక్సర్ మైక్ టైసన్ మరొక కీలక పాత్ర లో నటిస్తున్నారు.

"మీరు గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని విశ్వసిస్తే,
మీరు స్వయం సహాయాన్ని నమ్ముతారు, ఇది ఉత్తమ సహాయం"
—డా. బి.ఆర్ అంబేద్కర్

BUSINESS v/s SOCIAL ENGINEERING

20 సంవత్సరాల స్నేహ గ్రూప్ ప్రయాణం
వ్యాపారమా...? లేక సోషల్ ఇంజనీరింగా...?
మీరే చెప్పండి

BUSSINESS
వ్యాపారం ద్వారా వచ్చే లాభాన్ని పార్ట్నర్స్ గాని డైరెక్టర్ గాని పంచుకోవడాటాన్ని వ్యాపారం (Bussiness) అంటారు

SOCIAL ENGINEERING
సంస్థ నిర్వహించే కార్యకలాపాల ద్వార వచ్చే లాభం మొత్తాన్ని సొసైటీ మార్పు కోసం,పేదల అభివృద్ధి కొరకు,విద్య కొరకు,ఆరోగ్యం కొరకు వాడటాన్ని సోషల్ ఇంజనీరింగ్ అంటారు.

స్నేహ చిట్స్ లో కంపెనీకి వచ్చే లాభాల్ని చారిటీకి వాడుతూ మెంబర్స్‌కు వచ్చే లాభాలను మెంబర్స్‌కు ఇవ్వటం జరుగుతోంది

అంబేడ్కర్ టీవీ నిర్మాణం కొరకు స్నేహ మ్యాక్స్ లో డిపాజిట్ చేసిన వారందరికీ వారికి ఇవ్వాల్సిన ఇంట్రెస్ట్ (Interest)ని ఇచ్చి ఆ డిపాజిట్ ని మెంబర్స్‌కి అప్పులు ఇచ్చి,రికవర్ చేసిన తర్వాత వచ్చే లాభాల మొత్తాన్ని అంబేడ్కర్ టీవీ ఛానల్‌ను నడపటానికి వినియోగిస్తున్నాం

అంబేడ్కర్ టీవీ ఛానల్
సామాజిక దృక్పథంతో బహుజన సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, తద్వారా పరిష్కారమార్గంలోకి తీసుకెళ్లడానికి ప్రయత్నం చేస్తుంది

మహిళలు సాధించిన పురోగతి స్థాయి ద్వారా నేను సమాజ పురోగతిని కొలుస్తాను.
—డా. బి.ఆర్ అంబేడ్కర్

జై పూలే జై భీమ్ జై బహుజన జై భారత్

Printed,Published & Owned by: Sajja Dhananjaya Sarath, Printing at : Unyted Publications, From H.no: #5+-61,-3, Rajendra Nagar, Seethampet, Visakhapatnam-16 ANDHRAPRADESH, India. Editor: Sajja Dhananjaya Sarath. RNI:APTEL/2008/25531,Permitted for posting under concession rates of postage, Postal Registration No. VJ/189/2017-19,Email.editor.prajapalana@gmail.com